ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 49

గురువారం 18 జూలై 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

# రైతు రుణమాఫీపై 20 ఏళ్లు చెప్పకోవాలి


## రైతుల ఆత్మహత్య నివారణకే హామీల అమలు

- రాహుల్ హామీ ఇస్తే..అమలు అవుతుందన్నదే లక్ష్యం
- మోడీ లాగా హామీలను విస్మరించే ప్రసక్తి లేదు
- దేశమంతా చర్చించుకునేలా రుణమాఫీపై సంబరాలు
- వీడియో కాన్ఫరున్స్ ద్వారా పాల్గొంటానన్న సిఎం రేవంత్
- ప్రజాభవన్ సమావేశంలో సిఎం రేవంత్ ఉద్ఘాటన

రైతు రుణమాఫీ అమలుకు సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు కీలక సూచన చేశారు. గతంలో కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన ఉచిత కరెంటు, ఆరోగ్య శ్రీ, ఇందిరమ్మ ఇండ్ల గురించి ఇప్పటికీ చెప్పకుంటూ ఉన్నామని గుర్తుచేశారు. రేపు రైతు రుణమాఫీ గురించి 20 సంవత్సరాలు చెప్పకోవాలని ఆయన కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

హైదరాబాద్,జూలై17 :రైతులు ఆత్మహత్య చేసుకోవద్దని చెప్పడానికే రూ. 2 లక్షల రుణ మాఫీని అమలు చేస్తున్నామని వివరించారు. గురువారం సాయంత్రం 4 గంటలకు తాను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు వేదికలకు కనెక్ట్ అవుతానని చెప్పారు. రైతు వేదికలో రైతులంతా సమావేశం కావాలని, ఇది రాహుల్ గాంధీ చెప్పారని చెప్పండని కాంగ్రెస్ కేడర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వ్యవసాయ విధానంలో తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలని







# నేటి నుంచి డీఎస్సీ

- ఆగస్టు 5 వరకు పరీక్షలు
- మొత్తం పోస్టులు 11,062
- 2.70 లక్షల మంది అభ్యర్థులు

హైదరాబాద్, జులై 17 : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ పరీక్షలను గురువారం నుంచి నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 56 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆగస్టు 5 వరకు జరిగే ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. 11,062 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. సుమారు 2.79 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో బుధవారం రాత్రి వరకు 2.48 లక్షల మంది తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్

మిగతా 2 లో



## పాలన వదిలేసిన కాంగ్రెస్ ప్రతీకారంపైనే దృష్టి

- రాజకీయాల్లో కక్ష సాధింపులకు చోటు లేదు
- ఇకనైనా బుద్ధితెచ్చుకొని సమస్యలు పరిష్కరించాలి
- తీరు మార్చుకోకుంటే ప్రజాక్షేత్రంలోనూ ఇదే తీర్పు
- సుప్రీం తీర్పుపై బిఆర్ఎస్ నేత కే తారకరామారావు

.. వివరాలు 2లో



## వేగంగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు

- రూట్ మ్యాప్ తయారు చేశామన్న ఉత్తమ్
- నీటిపారుదల అధికారులతో సుదీర్ఘ సమీక్ష

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాల వేగవంతానికి నీటిపారుదల శాఖ రూట్ మ్యాప్ తయారు చేశామని ఆ శాఖ మంత్రి యన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మహబూబ్‌నగర్ పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు 2025 డిసెంబర్ నాటికి ఆ జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు ఆయన వెల్లడించారు.

హైదరాబాద్,జూలై17 : పాలమూరు, రంగారెడ్డితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌ల పురోగతితోపాటు నిర్మించాల్సిన ప్రాజెక్టులపై జలసౌధలో నీటిపారుదల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. నీటి పారుదల శాఖా కార్యదర్శి రాహుల్ బొజ్జతోపాటు పలువురు అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో

మిగతా 2 లో

## పార్టీ మారిన వారిని మాజీలు చేసే వరకు నిద్రపోము

- అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్లి కొట్లాడుతాం
- రాజశేఖర్ రెడ్డి కూడా టిఆర్ఎస్ ఖాళీ అన్నాడు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



సంగారెడ్డి,జూలై17 : పార్టీ మారిన ఎమ్మెల్యేలను మాజీలు చేసే వరకు నిద్రపోమని బిఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టుకు వెళతామన్నారు . వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కూడా మా ఎమ్మెల్యేలను గుంజుకున్నడు.. పార్టీ పని అయిపోయింది అన్నరు..అన్నవాళ్లే కాలగర్భంలో కలిసిపోయారని

మిగతా 2 లో

## రేషన్ కార్డులు లేని ఆరు లక్షల కుటుంబాలకూ మాఫీ

### ఆగస్టు దాటకుండానే రెండు లక్షల రుణమాఫీ పూర్తి

- ఇచ్చిన హామీ మేరకు ఆగస్ట్ 15 లోగా రుణమాఫీ ప్రక్రియ పూర్తి
- రూపాయి..రూపాయి పోగుచేసి రుణమాఫీ అమలు చేస్తున్నాం
- 7లక్షల కోట్ల అప్పునెత్తిన పెట్టినా...హామీల అమలుకు కృషి
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్,జూలై17 : తెలంగాణలో రైతు రుణ మాఫీపై హాట్ హాట్ గా చర్చ జరుగుతున్న వేళ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. రేషన్ కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ అందిస్తామని ప్రకటించారు. ఆగస్టు దాటకుండానే రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పారు. రుణమాఫీ కార్యక్రమం అమలు చేసేందుకు నిద్రలేని రాత్రులు గడిపామని గుర్తుచేశారు. రూపాయి రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమం చేపట్టామని, అన్ని కుటుంబాలకు రుణమాఫీ చేస్తామని భట్టి స్పష్టం చేశారు. ఎవరిని వదలం అని రైతులకు డిప్యూటీ సీఎం భట్టి భరోసా

మిగతా 2 లో

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్..

### 12 మంది మావోయిస్టుల మృతి

- మృతుల్లో తిప్పగడ్డ దళం ఇన్‌చార్జి ఆత్రం లక్ష్మణ్
- ఏకే-47, ఎల్ఎంజీ తుపాకుల సీజ్
- ఒక ఎస్సై, మరో జవానుకు తూటా గాయాలు
- వారోత్సవాల ముందు నక్సల్స్‌కు భారీ ఎదురుదెబ్బ
- ఈ ఏడాది ఇది పదో ఎన్‌కౌంటర్
- ఏడు నెలల్లో 148 మంది నక్సల్స్ మృతి

చర్ల/వహదేవపూర్, జులై 17: దండకారణ్యంలో మరోసారి నెత్తురోడింది. మహారాష్ట్ర-ఛత్తీసగఢ్ సరిహద్దులోని గడ్చిరోలి అడవుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనలో సీ-60 బలగాలకు చెందిన ఒక ఎస్సై, మరో జవాన్

మిగతా 2 లో



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
18 జూలై
2024



# రైతురుణమాఫీపై 20 ఏళ్లు చెప్పుకోవాలి



**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని చెప్పారు. తన జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు అని అన్నారు. గురువారం సాయంత్రం 4గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతురుణాలు మాఫీ చేస్తున్నామని ప్రకటించారు. రూ.7వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళ్తాయని అన్నారు. నెలాఖరులోగా రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేస్తామని వివరించారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనమేనని తెలిపారు. టీపీసీసీ కార్యవర్గ సమావేశం బుధవారం ప్రజా భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, సీతక్క తదితరులు హాజరయ్యారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, రాం చంద్రు నాయక్ పాల్గొన్నారు. ప్రభుత్వం రేపు(గురువారం) రుణమాఫీ చేయనున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎం చర్చించారు. పీసీసీ చీఫ్ రేవంత్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మీడియాకి పలు కీలక విషయాలు వెల్లడించారు.ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని చెప్పామని చెప్పిన దాని కంటే ముందే రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారని గుర్తుచేశారు. రుణమాఫీ చేస్తామని చెబితే ఇది అసాధ్యమని చాలామంది అన్నారని చెప్పారు. చిత్తశుద్ధి ఉంటే అన్ని సాధ్యమని నిరూపించామని అన్నారు. నేటి సాయంత్రం రైతుల ఖాతాలో డబ్బులు పడతాయని తెలిపారు. 60 సంవత్సరాల తెలంగాణ ఆకాంక్షను ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ నెరవేర్చారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పితే చట్టమేనని ఉద్ఘాటించారు. సోనియా గాంధీ కుటుంబం గౌరవం కాపాడాలని అన్నారు. దేశానికి ఆదర్శ పాలన మనం ఎందుకు చేయకూడదని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ లోపల మరో లక్ష వేస్తామని ప్రకటించారు. వ్యవసాయం దండగ కాదు పండుగ అని వివరించారు. రైతులకు రుణమాఫీ చేయడం తన జీవితంలో మర్చిపోలేనిదని అన్నారు. రేపటి రాజకీయ భవిష్యత్తు రుణమాఫీతో ముడిపడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పాస్ పుస్తకం ఉన్న అందరికీ రైతు రుణ మాఫీ అవుతుందని స్పష్టం చేశారు. మాల్యా, నీరవ్ మోదీ లాంటి వారు వేల కోట్ల అప్పుల ఉన్న ఏం చేయలేరని రైతులను మాత్రమే ఇబ్బందులు పెడతారని అన్నారు. రుణమాఫీపై గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రచారం చేయాలని రేవంత్ పిలుపునిచ్చారు. ఓట్లు అడగడానికి గ్రామాలకు వెళ్లామని. ఇప్పుడు రుణ మాఫీ చేశామని గ్రామాల్లో చెప్పాలని అన్నారు. రుణమాఫీపై జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలని అన్నారు. పార్లమెంటు సభ్యులు రుణమాఫీపై నేషనల్ మీడియాలో చెప్పాలన్నారు. భారత దేశంలో ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేని పని తెలంగాణ ప్రభుత్వం చేసిందని ఉద్ఘటించారు. రుణమాఫీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ హామీ కాదని, ఇది రాహుల్ గాంధీ హామీ అని వివరించారు. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ఉచిత కరెంట్, ఆరోగ్యం శ్రీ ఇందిరమ్మ ఇళ్ల గురించి ఇప్పటికే చెప్పుకుంటున్నామని తెలిపారు. రేపు రైతు బంధు గురించి 20 సంవత్సరాలు చెప్పు కోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఢిల్లీలో ముగిసిన చంద్రబాబు పర్యటన

## అమిత్‌షాతో మాత్రమే చర్చలు

న్యూఢిల్లీ,జూలై 17 : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకరోజు ఢిల్లీ పర్యటన ముగిసింది. మంగళవారం సాయంత్రం ఆయన ఢిల్లీకి వెళ్లారు. రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఉదయం సీఎం అధికారిక నివాసం(1, జన్‌పథ్)లో పూజలు నిర్వహించారు. అనంతరం విజయవాడకు చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. ఏపీ ఆర్థిక పరిస్థితి గురించి అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసానికి గురైందని వెల్లడించారు. అస్తవ్యస్థ నిర్వహణ, అవినీతి కారణంగా ఏపీ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని చంద్రబాబు తెలిపారు.2019-24 ఆర్థిక సంవత్సరాల మధ్య మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అదుపు తప్పి, అస్థిరమైన అప్పులను వివరిస్తూ విడుదల చేసిన నాలుగు శ్వేతపత్రాలను అమిత్ షాకు వివరించానని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఏపీలో ఎన్డీఏకు అనుకూలంగా తీర్పునిచ్చారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని గాడిలో పెడతాయని చంద్రబాబు ట్వీట్ చేశారు. పర్యటనలో సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు కే. రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కేశినేని చిన్ని తదితరులు ఉన్నారు. కాగా.. జన్‌పథ్ నివాసంలో చంద్రబాబును బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ కలిశారు. అనంతరం చంద్రబాబు తన పర్యటన ముగించుకుని విజయవాడకు బయలుదేరారు. అయితే చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను సైతం కలుస్తారంటూ వార్తలు వచ్చాయి. నిర్మలతో భేటీ ఏమీ లేదని అధికారులు వెల్లడించారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన కేవలం కొన్ని గంటలు మాత్రమే సాగింది.

# రేషన్ కార్డులు లేని ఆరు లక్షల కుటుంబాలకూ మాఫీ

**మొదటి పేజీ తరువాయి**

కల్పించారు. ప్రజాభవన్ లో కాంగ్రెస్ కీలక నాయకులు సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రతి పోలింగ్ బూత్, ప్రతి ఓటర్ దగ్గరకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తల ఎత్తుకొని ఎక్కడ తగ్గకుండా ప్రచారం చేయాలని సూచించారు. మిగులు బడ్జెట్‌తో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీని 25,000 చొప్పున నాలుగు దఫాలుగా పూర్తి చేసిందని గుర్తుచేశారు. ఏడు లక్షల కోట్ల అప్పులతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ రెండు లక్షల రుణమాఫీనీ నెలల వ్యవధిలోనే అమలు చేస్తుందని భట్టి చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. అధికారం లోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఐదు హామీలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. అయితే అనుకున్నంతగా
ఈ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రచారం జరగడం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టులోపు 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటిస్తే అంతా ఆశ్చర్యపోయారని, సీఎం సవాల్ ఓట్ల కోసమే.. ఎన్నికల సవాల్ అనుకున్నారని చెప్పారు. కానీ.. అందరి అంచనాలు తలకిందులు చేస్తూ రూపాయి రూపాయి పోగుచేసి రుణమాఫీని అమలు చేయబోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ నేతలందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడే కార్యక్రమం రుణమాఫీ అని, చెప్పిన మాట ప్రకారం చేస్తున్నామని ప్రతి గ్రామానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని వివరించి రైతులు ప్రజల హృదయాలు గెలవాలని కాంగ్రెస్ కార్యకర్తలకు, నేతలకు భట్టి సూచించారు. ఆగస్టు నెల దాటకుండానే రూ.2లక్షల రైతు రుణమాఫీ పూర్తి చేస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ హామీ అమలు కోసం నిద్రలేని రాత్రులు గడిపామని, రూపాయి.. రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రేషన్‌కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు కూడా రుణమాఫీ అందిస్తామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే హామీలు అమలు చేస్తున్నాం. కానీ, అనుకున్నంత ప్రచారం క్షేత్రస్థాయిలో జరగట్లేదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని వివరిస్తూ రైతులు, ప్రజల హృదయాలు గెలవాలి అని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# మూడు రైళ్లకు స్టాపుల ఎత్తివేత

## రైల్వే శాఖ నిర్ణయంపై ఆందోళన

మిర్యాలగూడ,జూలై 17 : నారాయణాద్రి, విశాఖ, చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 19 నుంచి మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లలో స్టాప్ ఎత్తివేస్తూ రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ నిర్ణయంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులకు కష్టాలు మొదలు కానున్నాయి. కరోనా సమయంలో రైల్వేబోర్డు అధికారులు నారాయణాద్రి, విశాఖ, చెన్నై రైళ్లకు ఆయా స్టేషన్లలో నిలపకుండా ఆదేశాలు జారీచేశారు. దీంతో ఉమ్మడి నల్గొండ, గుంటూరు జిల్లాల ప్రయాణికులు ఆందోళనలు చేపట్టారు. అప్పటి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా రైల్వే బోర్డు అధికారులను కలిసి విన్నవించడంతో ఏడాది క్రితం రైళ్లకు స్టాప్ ఏర్పాటు చేశారు. అప్పట్లో ఏడాది పాటు రైళ్లను నిలిపేందుకు ఆదేశాలు ఇవ్వడంతో ఆ సమయం ఈ నెల 19తో ముగియనుంది. ఆ రోజు నుంచి విశాఖ, నారాయణాద్రి, చెన్నై ఎక్స్‌ప్రెస్‌లకు రైల్వే ఐఆర్‌సీటీసీ అధికారులు మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల స్టేషన్‌లకు రిజర్వేషన్లు నిలిపివేశారు. విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలుకు నల్గొండలో కూడా స్టాప్ ఎత్తివేశారు. తిరుపతి వెళ్లే మిర్యాలగూడ డివిజన్ ప్రయాణికులు నల్గొండలో అర్ధరాత్రి 3 గంటలకు రైలు దిగి బస్సుల్లో రావాల్సిన పరిస్థితులు నెలకొంటుంది.

## జూనియర్ విద్యార్థులపై సీనియర్ల దాడి

మెదక్,జూలై 17 : ఇంటర్ చదువుతున్న సీనియర్ విద్యార్థులు జూనియర్లపై దాడి చేయడం కలకలం రేపింది. మెదక్ జిల్లా తూప్రాన్ పరిధి అల్లాపూర్‌లోని గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు.. ఫస్టియర్, పదో తరగతి విద్యార్థులపై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి భోజనాలు పూర్తిచేసిన తర్వాత నిద్రించేందుకు ఉపక్రమిస్తుండగా ఫస్టియర్, టెన్త్ విద్యార్థుల గదికి సెకండియర్ విద్యార్థులు వచ్చారు. ఈ క్రమంలో మాటామాటా పెరగడంతో జూనియర్లపై బకెట్లు, పెట్టెలు, కర్రలతో విచక్షణారహితంగా సీనియర్లు దాడికి పాల్పడ్డారు.

# గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. 12 మంది మావోయిస్టుల మృతి



**మొదటి పేజీ తరువాయి**

గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలం నుంచి అత్యంత అధునాతన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర, ఛత్తీసగఢ్ సరిహద్దులోని గడ్చిరోలి, కాంకేర్ జిల్లాల అడవుల్లో 12 నుంచి 15మంది మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులు సమాచారం అందుకున్నారు.
దీంతో సీ-60 బలగాలు ఉదయం 7 గంటల సమయంలో కూంబింగ్ ప్రారంభించారు. 10 గంటల సమయంలో వారికి నక్సలైట్లు తారసపడ్డారు. ఆరు గంటల పాటు ఇరువైపులా కాల్పులు జరిగాయి. సాయంత్రం 4 గంటల సమయంలో నక్సల్స్ వైపు నుంచి కాల్పులు నిలిచిపోవడంతో.. బలగాలు ముందుకు దూసుకెళ్లాయి. అక్కడ 12 మంది మావోయిస్టుల మృతదేహాలను, మూడు ఏకే-47 తుపాకులు ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ సభ్యుడు, తిప్పగడ్డ దళ ఇన్‌చార్జి ఆత్రం లక్ష్మణ్ అలియాస్ ఆత్రం విశాల్ మృతిచెందినట్లు ఎస్పీ వివరించారు. అతను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవాడని అనుమానిస్తున్నారు. మిగతా 11 మంది నక్సల్స్‌ను గుర్తించాల్సి ఉందని తెలిపారు. కాగా.. గడిచిన ఏడు నెలల్లో దండకారణ్యంలో 10 భారీ ఎన్‌కౌంటర్లు జరగ్గా.. 148 మంది మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు పార్టీ ప్రతీ సంవత్సరం జూలై 28 నుంచి వారంరోజుల పాటు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తుంది. ఈ ఏడాది వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో 20 రోజుల ముందుగానే వారోత్సవాలు నిర్వహించేందుకు పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలోనే భారీ ఎన్‌కౌంటర్ జరగడంతో వారికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

# నేటి నుంచి డీఎస్సీ

**మొదటి పేజీ తరువాయి**

చేసుకున్నారు. 2.30 గంటల పాటు జరిగే పరీక్షలో 160 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 80 మార్కులు కేటాయించారు. టెట్ ద్వారా మరో 20 మార్కులు వెయిటేజీలో భాగంగా కలపనున్నారు. డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహిస్తున్నారు. ఫలితాలు విడుదల చేసి, మెరిట్ జాబితాను మాత్రం జిల్లాల వారీగా ప్రకటిస్తారు. నియామకాలు కూడా జిల్లా యూనిట్‌గా చేయనున్నారు. కాగా, ప్రస్తుతం భర్తీ చేస్తున్న పోస్టుల్లో ఎస్‌జీటీ 6,508, భాషా పండితులు 272, పీఈటీ 182, స్పెషల్ క్యాటగిరీ స్కూల్ అసిస్టెంట్ 220, స్పెషల్ క్యాటగిరీ ఎస్‌జీటీ పోస్టులు 796 ఉన్నాయి.

# పాలన వదిలేసిన కాంగ్రెస్ ప్రతీకారంపైనే దృష్టి

హైదరాబాద్, జూలై 17 : విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు తప్పు బట్టిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ మీద కాంగ్రెస్ అధికార దుర్వినియోగంపై సుప్రీంకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చిందని తెలిపారు. రాజకీయాల్లో కక్ష సాధింపు, ప్రతీకారాలకు చోటు ఉండకూడదని బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలన గాలికి వదిలేసి రాజకీయ కక్షలు, ప్రతీకార చర్యలపైనే ఎకువ దృష్టి సారించిందని విమర్శించారు. రాజకీయ కక్షలు, ప్రతీకార చర్యలకూ ఓ పరిమితి ఉంటుందని, ఆ పరిమితులను దాటి కాంగ్రెస్ పార్టీ %ం%కేసీఆర్‌పై దుష్ప్రచారాలకు పూనుకున్నదని మండిపడ్డారు. అలాంటి ప్రయత్నాలు ఎకువ కాలం నిలబడవని సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు స్పష్టం చేసిందని తెలిపారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, లేదంటే ప్రజా క్షేత్రంలో కూడా ఇలాంటి తీర్పే రావటం ఖాయమని హెచ్చరించారు. కాంగ్రెస్ చేసే దుష్ప్రచారాలకు దేవుడు కూడా తగిన బుద్ధి చెప్తాడని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు, కుంతంత్రాలు చేసినప్పటికీ చివరికి సత్యమే గెలుస్తుందని వ్యాఖ్యానించారు.

# పార్టీ మారిన వారిని మాజీలు చేసే వవరకు నిద్రపోము

**మొదటి పేజీ తరువాయి**

మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. బీఆర్ ఎస్ పార్టీలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఏం తక్కువ చేసినం.. ఎందుకు కాంగ్రెస్ లోకి పోయిండు అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉంటే కష్టాలు వస్తాయని.. భయపడి పార్టీ మారాడు అని అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గానికి ఏది అడిగితే అది మంజూరు చేశామన్నారు. నిధుల వరద పారించామన్నారు. మహిపాల్ రెడ్డి పార్టీ మారినా బీఆర్ ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. నియోజకవర్గానికి నేను అండగా ఉంటానన్నారు హరీష్ రావు. ఎమ్మెల్యే పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని గతంలో రేవంత్ రెడ్డి అన్నారు... ఇప్పుడు మాతర్ం ఆయనే ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యేలకు కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. రుణమాఫీ పై జీవోను వెంటనే మార్చాలని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. మాటల్లోనే పాస్ బుక్ ప్రకారం అని అంటున్నారు. కానీ జీవోల్లో మాత్రం తెల్ల రేషన్ కార్డు నిబంధన అంటున్నారు. రుణమాఫీలో పీఎం కిసాన్, రేషన్ కార్డు నిబంధనతో ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గతంలో కేసీఆర్ అందరికి రుణమాఫీ చేశారని .. ఇప్పుడు కూడా మునపటి పద్దతిలోనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు మాజీ మంత్రి హరీష్ రావు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీల్లో ఒక్కటి అమలు చేయలేదని హరీష్ రావు ఆరోపించారు. ఏడు నెలలుగా కళ్యాణ లక్ష్మీ చెక్కులు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉచిత బస్సు తప్పా అన్ని తుస్సే అని అన్నారు. హమీలపై త్వరలోనే ప్రజలు ప్రభుత్వంపై తిరగబడతారని అన్నారు. ప్రభుత్వం తప్పులపై పోరాటం చేస్తామన్నారు..

# వేంగంగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు



**మొదటి పేజీ తరువాయి**

మాట్లాడారు. కృష్ణా బేసిన్ పరిధిలోని పాలమూరు-, రంగారెడ్డి ప్రాజెక్ట్ తో పాటు మహబూబ్నగర్ జిల్లాలోని కోయిల్ సాగర్, ఆర్ బి ఎల్ ఐ యస్, జే. ఎన్.ఎల్.ఐ .యస్,డిండి ఎల్ ఐ యస్,ఏ.యం.ఆర్ యస్ ఎల్ బి సి, నె÷-టటెంపాడు, భీమా, కల్వకుర్తి ఎల్ ఐ సి పాజెక్టులు. గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, నిల్వాయి ప్రాజెక్ట్, పాలెం వాగు, మత్తడి వాగు, యస్.ఆర్ యస్.పి ఫెస్2, చనాకా కోరాట, లోయర్ పెన్ గంగా, దేవాదుల, మోదీ కుంటవాగు, యస్.వై.పి, జే సి ఆర్ డి ఎల్ ఐ యస్, సీతారామ ఎల్ ఐ యస్ లపై సమగ్రమైన సమీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రాజెక్ట్ లతో పాటు గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, మోదీకుంట,లోయర్ పెన్ గంగా, చనాక కోరాట, శ్రీపాద ఎల్లంపల్లి, జే సి ఆర్ డి ఎల్ యస్ తదితరాలు పూర్తి చేసేందుకు రూ.8వేల కోట్ల పై చిలుకు అవుతుందన్న అంచనాకు అధికారులు వచ్చారన్నారు. అయితే అదే సమయంలో 2025 డిసెంబర్ నెలాఖరికి పూర్తి చేయాలన్న నిర్దేశిత లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించుకున్న తాము నీటి పారుదల శాఖకు అదనంగా మరో 11 వేల కోట్ల బ్జడెట్ ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆర్థిక శాఖాకు పంపాలని నిర్ణయించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లో రూ.28,000 కోట్లు నీటి పారుదల శాఖాకు కేటాయించగా అందులో గత ప్రభుత్వం ప్రాజెక్ట్ ల నిర్మాణాల పేరుతో చేసిన అప్పులకు కడుతున్న వడ్డీయే రూ.18,000 కోట్లు అని మరో రెండు వేల కోట్లు జీత భత్యాలకే ఖర్చు అవుతున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. అందుకే అదనపు బడ్జెట్ ను సమీకరించుకుని సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఆరు లక్షల పై చిలుకు ఎకరాలు సేద్యంలోకి తేవాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. అందులో భాగంగా ప్రాధాన్యత క్రమంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలను ఏ,బి,సి కేటగిరీలుగా విభజించామన్నారు. ఇప్పటికే పూర్తి కావొచ్చిన వాటిని ఏ కేటగిరీలో, ఆ తరువాత బి, ఆ తరువాత సి లుగా విభజించడం జరిగిందన్నారు.
ఏ కేటగిరీలో 240.66 కోట్లతో 47,882 ఏకరాల ఆయకట్టును సేద్యం లోకి తీసుకొస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అదే విదంగా ఆన్ గోయింగ్ ప్రాజెక్టులుగా నిర్మితమౌతున్న ప్రాజెక్టులకు సుమారు 7,500 కోట్ల పై చిలుకు అంచనా వ్యయంతో 5,84,770 ఎకరాల ఆయకట్టు భూమిని సేద్యం లోకి తీసుక రానున్నట్లు ఆయన చెప్పారు. అదే విదంగా నిర్మల్ జిల్లా సదర మాట్ ప్రాజెక్టు ను ఈ నేల చివరి నాటికి,ఖమ్మం జిల్లాలో సీతారాం ప్రాజెక్ట్ ను ఆగస్టు 15 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
18 జూలై
2024





# గీత వృత్తిదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను కలిసిన బిజెపి గీతా సెల్ ప్రతినిధులు

హైదరాబాద్, రోమింగ్ న్యూస్: గీత వృత్తిదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర బిజెపి గీతా సెల్ రాష్ట్ర రవాణా, మరియు బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను కలిసి విజ్ఞప్తి చేసింది. బిజెపి గీతా సెల్ కన్వీనర్ పటేల్ వెంకటేష్ గౌడ్, కో కన్వీనర్ మీరయ్య గౌడుల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మంత్రిని కలిసి 12 సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. తాటి చెట్టుపై నుండి పడి చనిపోయిన వారికి వెంటనే ఎలాంటి నిబంధనలు పెట్టకుండా పది లక్షల రూపాయల ఎక్స్ గ్రెషియా చెల్లించాలని కోరారు. చనిపోయిన వారికి దహన సంస్కారాల ఖర్చులకోసం అదే రోజు 51 వేల రూపాయలు చెల్లించాలన్నారు.
తాటి చెట్టు పైనుండి పడి ప్రమాదానికి గురైన వారికి ఎలాంటి నిబంధనలు పెట్టకుండా పారదర్శకంగా 10 లక్షలు చెల్లించడంతోపాటు తక్షణ సహాయం కోసం హాస్పిటల్ ఖర్చులకోసం 25వేల రూపాయలు చెల్లించాలన్నారు. చెట్లు ఎక్కడానికి నూతన విధానాన్ని తీసుకురావాలన్నారు. అందులో భాగంగా సేఫ్టీ మోకులు సంబంధిత యంత్రాలు, పరికరాలు మోటార్ సైకిల్ లను గీత వృత్తిదారులకు రాష్ట్రమంతా సమకూర్చాలని కోరారు. కొత్తగా ఏర్పడిన గ్రామాలలో వృత్తిదారుల సొసైటీలను ఏర్పాటు చేయాలన్నారు. లైసెన్సులు లేని గీత కార్మికులకు వెంటనే లైసెన్సులు ఇవ్వాలని కోరారు. చనిపోయిన గీత వృత్తిదారుల కుటుంబంలోని విద్యార్థులు విద్యార్థులను వారి విద్య ఆగిపోకుండా ప్రభుత్వమే ఆదరించి వారికి పూర్తి విద్యను అందించాలి అన్నారు. వారి కుటుంబంలోని వారికి వాళ్ళ అర్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖలో గౌడులకు ప్రత్యేక రిజర్వేషన్ ఇచ్చి ఎక్కువమంది గౌడ్లను ఆ శాఖలో నియమించాలని ఆ విధంగా నిబంధనలు రూపొందించాలని చెప్పారు. వైన్ షాపులలో, బార్లలో ఎలాంటి నిబంధనలు పెట్టకుండా గౌడలకు 50 శాతం ప్రత్యేక రిజర్వేషన్ ఇచ్చి సొసైటీలకు నేరుగా బదిలీ చేయాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన విధంగా జనగాం జిల్లాను వెంటనే సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా పేరు మార్చాలని కోరారు. పూర్వపు ప్రభుత్వం ప్రకటించి వదిలివేసిన సర్దార్ పాపన్న విగ్రహాన్ని వెంటనే ట్యాంక్బండ్ పై ఆగస్టు 18 లోపు ప్రతిష్టించి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కోరారు. పూర్వం ప్రకటించి అమలు చేయని ప్రతి గ్రామానికి 5 ఎకరాల భూమిని వెంటనే కేటాయించి తాటి, ఈత చెట్లను నాటి ప్రభుత్వం పెంచాలని కోరారు. గోల్కొండ కోటను రాజధానిగా చేసుకుని పాలించిన ఏకైక హిందూ చక్రవర్తి అయినా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ గారి విగ్రహం కోటలో ప్రతిష్టించి కోట పేరును పాపన్న కోటగా నామకరణ చేసి అద్వితీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఘనంగా బిరన్న దేవుని బోనాలు



కేసముద్రం జులై 17 (రోమింగ్ న్యూస్): కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బిరన్న దేవుని బోనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించాగ కుర్మ సంఘం పెద్దలు చిన్నలు యువత ఊరి యొక్క బోనాలు చూడడానికి ఊరు పెద్దలు చిన్నలు చాలా ఉత్సాహంగా తరలివచ్చారు యొక్క బోనాలు ఆనందంగా జరిగినందుకు కుల పెద్దమనిషి గౌండ్ల యాదగిరి మరియు సారకల్లగొల్ల జూకంటి కుమురయ్య ఆనందం వ్యక్తం చేశారు.ఈ బోనాలను చూసి ఆనందించడానికి ఎసిఎఫ్ నాయకులు బండి విజయ్, కురుమ కులస్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 21న శ్రీ అమ్మవారికి శాకంభరీ ఉత్సవం



శ్రీశైలం, జూలై 17 (రోమింగ్ న్యూస్) : లోకకల్యాణం కోసం ఆషాఢపౌర్ణమిని పురస్కరించుకొని జూలై 21వ తేదీన శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి శాకంభరీ ఉత్సవం నిర్వహింపబడనున్నది. ఈ ఉత్సవంలో శ్రీఅమ్మవారి మూలమూర్తిని వివిధ రకాల కూరగాయలతోనూ, ఆకుకూరలతోనూ మరియు పలు రకాల ఫలాలతో విశేషంగా అలంకరించడం జరుగుతుంది. అదేవిధంగా అమ్మవారికి ఉత్సవ సంబంధి విశేషపూజలు జరిపించబడుతాయి. ఇంకా దేవాలయ ప్రాంగణం కూడా పలు రకాల ఆకుకూరలు, కూరగాయాలతో అలంకరించబడుతుంది. ఈ ఉత్సవంలో భాగంగానే శ్రీఅమ్మవారి ఉత్సవమూర్తికి, ఆలయప్రాంగణంలోని రాజరాజేశ్వరిదేవికి, గ్రామదేవత అంకాళమ్మకు ప్రత్యేకపూజలు, విశేషంగా చేయబడుతుంది. శాకాలంకరణ ఈ ఉత్సవములో ఆయా రకాల కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల పండ్లు వినియోగించబడుతాయి. ఈ విధంగా అమ్మవారిని శాకాలతో అర్చించడం వలన అతివృష్టి, అనావృష్టి నివారించబడి, సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగాపండుతాయని, కరువుకాటకాలు నివారించబడతాయని పురాణాలు చెబుతున్నాయి.కాగా పూర్వం హిరణ్యాక్షుని వంశానికి చెందిన దుర్గముడు అనే రాక్షసుడు తన తపశ్శక్తితో వేదాలను అంతర్థానం చేశాడు. దాంతో యజ్ఞయాగాదులు నిలిచిపోయాయి. ఈ కారణంగా కరువుకాటకాలతో తీవ్రక్షామం ఏర్పడింది. అప్పుడు మహర్షులందరూ ఆదిపరాశక్తిని గురించి తపస్సు చేశారు. ఆ తపస్సుకు పరాశక్తి ప్రసన్నురాలై లోకరక్షణకోసం దుర్గముడిని సంహరించి, వేదాలను రక్షించి వైదిక కర్మలను పునరుద్ధరింపజేసింది. ఈ సందర్భంలోనే జగన్మాత తన నుండి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు ఫలాలు మొదలైన శాకాలను సృష్టించి, క్షామాన్ని నివారించింది. ఆ విధంగా అవతరించిన ఆ పరాశక్తి స్వరూపమే శాకంభరీదేవి. ఈ కారణంగానే ఆషాఢ పౌర్ణమిరోజున అమ్మవారిని శాకాలతో అలంకరించి అర్చించే సంప్రదాయం ఏర్పడింది.

# తిరుమల లడ్డూలపై అపోహలు వద్దు

## అసత్య ప్రచారాలపై టిటిడి వివరణ

తిరుమల,జూలై 17 : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీలో ఎటువంటి అపోహలకు గురికావొద్దని టీటీడీ సూచించింది. ఎన్నో దశాబ్దాల నుంచి శ్రీ వైష్ణవ బ్రాహ్మణులు సంప్రదాయానుసారంగా లడ్డూను తయారు చేస్తున్నారని ఒక ప్రకటనలో తెలిపింది. సోషల్ మీడియా వేదికగా టీటీడీపై అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.తిరుమల శ్రీవారి పోటులో 980 మంది హిందూ మతానికి చెందిన పోటు కార్మికులకు నిర్దేశించిన వివిధ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారని స్పష్టం చేసింది. వీరిలో శ్రీ వైష్ణవ బ్రాహ్మణులు లడ్డూల తయారీ, ముడి సరుకులు తీసుకురావడం వంటి పనులు చేస్తారని వివరించింది. ఇతరలు, లడ్డూలను తరలించడం, ఉగ్రాణం, పడి పోటు, లడ్డు కౌంటర్లలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపింది. ఇటీవల సోషల్ మీడియా వేదికగా శ్రీవారి లడ్డు ప్రసాదాలను థామస్ అనే కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారని అసత్య ప్రచారాలు వాస్తవం కాదని వెల్లడించింది.

# గుట్ట నరసింహస్వామి సన్నిధిలో డిప్యూటీ సీఎం సతీమణి పూజలు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సతీమణి నందిని విక్రమార్క దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ఆమెకు దర్శన ఏర్పాట్లను నిర్వహించారు. అనంతరం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శ్రీవారి ప్రసాదాన్ని ఆమెకు అందజేశారు. అర్చకులు ఆశీర్వచనం జరిపారు.













# జనగామ యువత చే ఎసిపి ప్రతిజ్ఞ

## గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### జనగామ ఎసిపి బి రాజమహేంద్ర నాయక్



జనగామ, జూలై 17: (రోమింగ్ న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా సమాజాన్ని ముఖ్యంగా యువతను పట్టిపీడుస్తున్న డ్రగ్స్, మత్తు పదార్థాల నుండి విముక్తి కలిగించడానికి జనగామ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అనేక సమాజ హిత కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం .
ఇందులో భాగంగా మంగళవారం ఉదయం జనగామలో యువతను చైతన్య పరుస్తూ దుర్ వ్యసనాలు, మత్తు పదార్థాల సేవనం, సైబర్ నేరాల వల్ల జరిగే సామాజిక, మానసిక, శారీరక, ఆర్థిక నష్టాలను వివరిస్తూ వెస్ట్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి), జనగామ ఏసిపి అయిన బి. రాజమహేంద్ర నాయక్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యువత బలహీనతలకు దూరంగా ఉండాలని, అశ్లీల చిత్రాలను చూడకుండా మానసికంగా దృఢంగా ఎలా ఉండాలో చెబుతూ క్రమశిక్షణతో, మనోబలాన్ని పెంచుకుంటూ ఉత్తమ పౌరులుగా నడుచుకుంటామని ప్రతి ఒక్కరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఎసిపి మహేంద్ర నాయక్ తోపాటు ఆయన వెంట జనగామ సిఐ రఘుపతి రెడ్డి , ఎస్సై సృజన్ కుమార్, మహిళా ఎస్సై శ్వేత తదితరులు పాల్గొని మాట్లాడారు. పోలీస్ అధికారులు కూడా ప్రతిజ్ఞ చేస్తూ యువతతో ప్రతిజ్ఞ చేయించడం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మన దేశంలో మారుతున్న చట్టాలను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవాలని దానికి తగ్గట్టు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ ఉత్తమ పౌరులుగా వ్యవహరించాలని వారికి అనేక ఉదాహరణలు తెలుపుతూ వివరించారు. మత్తు పదార్థాలకు ఎవరు కూడా బానిసలుగా కాకూడదని, ఒకవేళ ఎవరైనా బలహీనంగా ఉంటే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అంతేగాని తెలిసి తెలియక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారికి సహకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని అని వారు హెచ్చరించారు. సుఖ సంతోషాలతో కూడిన సమ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. జనగామను గంజాయి లాంటి అనేక ఇతర మత్తు పదార్థాలకు విముక్తి కలిగిన జిల్లాగా తీర్చిదిద్దుతామని అందరిచే ప్రతిజ్ఞ చేయిస్తూ ఇందులో ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. మరోవైపు నానాటికి పెరుగుతున్న సైబర్ మోసాలను ఏ విధంగా ఎదుర్కోవాలో వివరిస్తూ యువతను వారు చైతన్యపరిచారు. ఏ విషయంలోనైనా చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న వారి విషయాలను జనగామ పోలీసులకు ఈ నెంబర్ ద్వారా 8712685032 సమాచారాన్ని తెలపాలని, సమాచారాన్ని అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని వారు హామీ ఇచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టుల సత్తా చూపాలి



కేసముద్రం జులై 17 (రోమింగ్ న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టుల సత్తా చూపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్,సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి. అజయ్ సారథి రెడ్డి అన్నారు . బుధవారం మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో సిపిఐ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం కౌంటం ఉపేందర్ అధ్యక్షతన జరిగింది.వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ మతతత్వ విధానాలతో,ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పాలన కొనసాగిస్తుందన్నారు.ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు.దేశ జాతి సంపదలైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, దేశ సంపదను దోచుకుంటుందన్నారు. సంస్కరణ పేరుతో కార్మిక చట్టాలను సవరిస్తూ పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోచే విధంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు.ఇది ప్రజా ప్రభుత్వమా లేక కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలికే ప్రభుత్వమా అని ప్రశ్నించారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా దాట వేస్తుందన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి మండల కేంద్రంలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్న రని అన్నారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో అగ్ని ప్రమాదలనునివారించవన్నారుగత ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేయడం వలన అనేక ప్రమాదాలతో కోట్లాది రూపాయల ఆస్తిని కోల్పోయారని అన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వమైన అగ్నిమాపక కేంద్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని . ప్రజల పక్షాన అనునిత్యం ప్రజా సమస్యలపై పరిష్కారం కోసం సిపిఐ పార్టీ ఉద్యమిస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించడం వలన ప్రజా సమస్యల పరిష్కారం కోసం క వ ు న్యా ని స్ట లు పోరాడుతారని అన్నారు. అదేవిధంగా కోరుకొండ పల్లి భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకురాలు పేర్ని మల్లమ్మ మరణించిన సందర్భంగా సంతాప సభ నిర్వహించారు.మల్లక్క తుది శ్వాస వరకు సిపిఐ పార్టీలో ఉంటూ మహిళలను చైతన్య పరచటంలో కీలకపాత్ర వహించిందన్నారు. పేర్ని మల్లక్క ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, జిల్లా కార్యక సభ్యుడు పెరుగు కుమార్,సిపిఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్,బోనగిరి హైమావతి, గుండెల కొమరయ్య,గుండు సోమయ్య,అందె గురువయ్య ఎస్ కే ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ఓం శ్రీ గురుభ్యో నమ
గురువారం, జూలై 18, 2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం
దక్షిణాయణం - గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం - శుక్ల పక్షం
తిథి : ద్వాదశి సా6.13 వరకు
వారం : గురువారం (బృహస్పతివాసరే)
నక్షత్రం : జ్యేష్ఠ రా2.09 వరకు
యోగం : బ్రహ్మం తె4.25 వరకు
కరణం : బవ ఉ6.04 వరకు
తదుపరి బాలువ సా6.13 వరకు
వర్జ్యం : ఉ7.07 - 8.46
దుర్ముహూర్తము : ఉ9.56 - 10.48
మరల మ3.07 - 3.58
అమృతకాలం : సా5.33 - 6.42
రాహుకాలం : మ1.30 - 3.00
యమగండ/కేతుకాలం : ఉ6.00 - 7.30
సూర్యరాశి: కర్కాటకం || చంద్రరాశి: వృశ్చికం
సూర్యోదయం: 5.38 ఎ.ఎం
సూర్యాస్తమయం: 6.34
సర్వేజనా సుఖినోభవంతు
శుభమస్తు

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 18 జూలై 2024



# నగరంలో వీధి కుక్కల స్వైరవిహారం

## జవహర్ నగర్‌లో కుక్కల దాడిలో బాలుడు మృతి

## ఘటనపై తీవ్రంగా స్పందించిన సిఎం రేవంత్

## తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం



హైదరాబాద్,జూలై 17 : హైదరాబాద్‌లో కుక్కల దాడులు నిత్యకృత్యమైపోయాయి. రోజూ ఏదో ప్రాంతంలో కుక్కల దాడులు చూస్తూనే ఉన్నాం. తాజాగా మరో చిన్నారి ప్రాణం తీశాయి కుక్కలు. పాలకులు మారినా, కొత్త అధికారులు పగ్గాలు చెపడుతున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండటం లేదు. జిహెచ్ఎంసీ పరిధిలో వీధి కుక్కల దాడిలో మరో బాలుడు బలియ్యాడు. మంగళవారం సాయంత్రం రెండేళ్ల బాలుడిపై వీధి కుక్కల దాడి చేసి పీక్కుతిన్నాయి. ఈ దారుణ సంఘటన మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లో చోటుచేసుకుంది. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వికలాంగుల కాలనీలో రెండేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబంతోపాటు కాలనీలో విషాదం నెలకొంది. .జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత కొద్ది నెలలుగా వీధి కుక్కలు సైర విహారం చేస్తున్నాయని?అయినప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వీధికుక్కలు రెచ్చిపోతున్నాయని మండిపడుతున్నారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో ఇంటిబయట ఆడుకుంటున్న బాలుడిపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. మంగళవారం రాత్రి విహాన్ అనే బాలుడు ఇంటి బయట ఆడుకున్న టైంలో కుక్కలు దాడి చేశాయి. విచక్షణరహితంగా పట్టి పీకేశాయి. స్థానికులు స్పందించి కుక్కలను తరిమేశారు. ఆ బాలుడిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న విహాన్ పరిస్థితి విషమించింది. వైద్యులు ఎంతగా ప్రయత్నించినా పిల్లాడిని బతికించలేకపోయారు. ఈ ఉదయాన్ని ఆ బాలుడు చికిత్స తీసుకుంటూ కన్నుమూశాడు. ఎంతో ప్రేమగా పెంచుకున్న విహాన్ మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో కూరుకుపోయింది. విహాన్ లేదన్న తెలుసుకున్న ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వారిని ఆపడం ఎవరి వల్లా కావడం లేదు. ఆ సీన్ చూసిన వారందరూ కంటతడి పెట్టుకున్నారు. వీది కుక్కల దాడిలో బాలుడు మృతి చెందిన దుర్ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. విహాన్ మృతి తనను ఎంతో కలచి వేసిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే కాదు ఈ మధ్య కాలంలో ఇలాంటివి తరచూ జరుగుతున్నాయని దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పారు. వీధి కుక్కలు గురించి సమాచారం ఇచ్చేందుకు కాల్ సెంటర్ లేదా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వీటితోపాటు దాడులు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై బ్లూక్రాస్ వంటి సంస్థలు, పశువైద్య నిపుణులోత మాట్లాడాలని సూచించారు. ఇలాంటి ఘటనల్లో ఇతర రాష్ట్రాల్లో ఎలాంటిజాగ్రత్తలు తీసుకుంటాన్నాయి అక్కడ ఎలాంటి విధానాలు అవలంబిస్తున్నారో కూడా తెలుసుకొని వాటిలో మంచి విధానాలు అవలంబించాలన్నారు. కుక్క కాటుకు గురై ఆసుపత్రికి వచ్చే వాళు నిరాశతో వెళ్లే పరిస్థితి ఉండకూడదని సిఎం తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో కుక్కకాటు చికిత్స మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జగిత్యాలలో కూడా ఇలాంటి దుర్ఘటన జరిగింది. బీర్పూర్ మండలం మంగెలలో ఇంటి బయట ఆడుకుంటున్న దేవేందర్ అనే ఏడేళ్ల బాలుడిపై కుక్క దాడి
చేసింది. తీవ్రంగా గాయపరిచింది. వెంటనే కుటుంబసభ్యులు దేవందర్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఓ చిన్నారిని చూసి కుక్క పరుగెత్తుకొని వచ్చింది. అయితే ఆ చిన్నారి వేరే వైపునకు పరుగెత్తింది. ఇంతలో ఓ బండిపై ఉన్న దేవందర్ కిందికి దిగి వెళ్లి పోసాగాడు. అంతే అక్కడే ఉన్న కుక్క దేవందర్‌పై అటాక్ చేసింది.

# బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారద



హైదరాబాద్,జూలై 17 : తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బాధ్యతలు స్వీకరించారు. బుధవారం బుద్ధభవన్లోఓ ఆమె బాధ్యతలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క తదితరులు హాజరయ్యారు. శారదకు అభినందనలు తెలిపారు.

# మేడిగడ్డకు భారీగా వరదనీరు

## సరస్వతీ బ్యారేజీలో నిలిచిపోయిన సెస్మిక్ పరీక్షలు

## ఓపి గనుల్లో నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

జయశంకర్ భూపాలపల్లి,జూలై 17 : కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం సరస్వతీ బ్యారేజీలో సెస్మిక్ పరీక్షలకు వర్షం కారణంగా తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నిపుణులు బ్యారేజ్ టెస్టులు నిలిపివేశారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కు వరద ఉధృతి క్రమక్రమంగా పెరుగుతుంది. గత రెండు రోజుల నుండి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి, ప్రాణహిత నదులలోకి వరద నీరు చేరి ప్రవహిస్తుంది. దీంతో మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ వద్ద 49వేల 500 క్యుసెక్కుల వరద వస్తుండగా బ్యారేజ్ లోని 85 గేట్లన్ని పూర్తిగా ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగా ఇరిగేషన్ అధికారులు దిగువకు తరలిస్తున్నారు. ఎగువన ఉన్న కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదుల నీటిమట్టం 5.40 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది. మానేరు నుంచి 4 వేల క్యూసెక్కుల వరద రావడంతో పనులకు ఆటంకం కలిగింది. బ్యారేజీకి ఎగువ, దిగువన 44 జియో ఫిజికల్, సెస్మిక్ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, మరో 9 పరీక్షలు పెండింగ్లో ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో సింగరేణి ఉపరితల బొగ్గు గనుల్లో భారీగా నీరు, మట్టి చేరి ఉత్పత్తికి అంతరాయం కలిగినట్లు అధికారులు తెలిపారు. భూపాలపల్లి ఓసీ–2, 3 గనుల్లో 6 వేల టన్నులు, తాడిచర్ల ఓసీలో 4 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందని, దాదాపు సింగరేణికి రూ. కోటి వరకు నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. కాగా, వర్షాలు తగ్గుము ఖం పట్టిన వెంటనే పనులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు భారీ వర్షం నేపథ్యంలో అన్నారం (సరస్వతి) బరాజ్ అప్ స్ట్రీమ్‌లో చేపట్టిన రెండో దశ జియో ఫిజికల్ పరీక్షలు బుధవారం నిలిచిపోయాయి. 29, 30వ గేట్ వద్ద పుణె నుంచి వచ్చిన సీడబ్ల్యూపీఆర్ఎస్ రెండో బృందం వారం రోజులుగా బోర్ వెల్ వేస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాన తగ్గుముఖం పట్టిన తర్వాత మళ్లీ పరీక్షలు చేపడతామని ఇంజినీర్లు తెలిపారు.

# ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు

## హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటన

హైదరాబాద్,జూలై 17 : రాష్ట్రంలో ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతాయని తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. నిన్న దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర విదర్భ ప్రాంతంలో కేంద్రీకృతమైన అల్పపీడన ప్రాంతం ఈ రోజు బలహీనపడినట్లు తెలిపింది. రుతుపవన ద్రోణి ఈరోజు జైసాల్మయిర్, కోట, గుణ, కళింగపట్నం తూర్పు ప్రాంతం గుండా మధ్య బంగాళాఖాతం వరకు పయనిస్తూ సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. మరో అల్పపీడనం ఈ నెల 19న పశ్చిమ మధ్య దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

# మూసీని ప్రక్షాళన చేయాల్సిందే

## 20న చర్చా గోష్టిని పెట్టిన సిపిఎం

భువనగిరి,జూలై 17 : మూసీని ప్రక్షాళన చేసి ప్రత్యామ్నాయంగా కృష్ణా, గోదావరి జలాలను అందించాలని సిపిఎం డిమాండ్ చేసింది. జిల్లా వ్యాప్తంగా భువనగిరి, పోచంపల్లి, బీబీనగర్, వలిగొండ, రామన్నపేట, మోత్కూరు, ఆత్మకూరు, అడ్డగూడూరు మండలాల రైతాంగానికి సాగునీరు అందిస్తున్న మూసీని ప్రక్షాళన చేయాలన్నారు. ప్రత్యామ్నాయంగా కృష్ణా, గోదావరి జలాలను అందించాలని ఈనెల 20వ తేదీన సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగే చర్చా గోష్టిని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కిసాన్ సంఘం జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి హాజరవుతారని తెలిపారు. మూసీ పరీవాహక ప్రాంత రైతాంగం, మేధావులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆయనతోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటి సభ్యులు దయ్యాల నరసింహా, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, నాయకులు ముత్యాలు, లావుడ్య రాజు, రాంబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

# అజిత్ పవార్‌కు గట్టి ఎదురుదెబ్బ

## నలుగురు ఎన్సీపి నేతలు పార్టీకి గుడ్‌బై

## అనేకులు మళ్లీ పవార్ గూటికి చేరేందుకు యత్నం

ముంబయి,జూలై 17 : మరికొద్ది మాసాల్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నవేళ.. అజిత్ పవార్ సారథ్యంలో ఎన్సీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన నలుగురు కీలక నేతలు పింప్రీ చించ్వాద్ యూనిట్ చీఫ్ అజిత్ గవాహనేతోపాటు యష్ సానే, రాహుల్ బోంస్లే, పంకజ్ బాలేఖర్లు బుధవారం రాజీనామా చేశారు. అయితే వీరంతా వచ్చే వారం శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కుండువా కప్పుకోనున్నారనే తెలుస్తుంది. మరోవైపు అజిత్ పవార్ పార్టీలోని పలువురు నేతలు తమ శిబిరంతో సంప్రదింపులు జరుపుతున్నారంటూ శరద్ పవార్ ఇటీవల వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

ఇక భోసారి అసెంబ్లీ టికెట్ కోసం అజిత్ గవాహనే ప్రయత్నించారు. కానీ ఆయనకు టికెట్ కేటాయించేందు అజిత్ పవార్ నిరాకరించారు. దీంతో ఆయన రాజీనామా చేశారనే ఓ ప్రచారం అయితే నడుస్తుంది. అదీకాక సదరు అసెంబ్లీ స్థానం నుంచి గత రెండు పర్యాయాలు బీజేపీ అభ్యర్థి మహేశ్ లంగ్డే విజయం సాధిస్తు వస్తున్నారు. అయి-తే మహారాష్ట్రలో మహాయుతి కూటిమి అధికారంలో ఉంది. ఈ కూటమిలో శివసేన (శిండే), బీజేపీ, ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీలు ఉన్నాయి. దీంతో మరోసారి మహేశ్ లంగ్డేకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించే అవకాశాలున్నాయి. అదీకాక ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సైతం ఈ కూటమి కొన్ని సీట్లను మాత్రమే గెలుచుకుంది. చివరకు బారామతి నుంచి ఎన్సీపీ (శరద్ పవార్) అభ్యర్థిగా సుప్రియా సులే బరిలో దిగారు. ఆమెకు ప్రత్యర్థిగా అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ పోటీ చేశారు. కానీ విజయం మాత్రం సుప్రియా సులేను వరించింది. అలాంటి పరిస్థితుల్లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సైతం మహాయుతి కూటమికి ప్రజల ఏ మేరకు విశ్వసిస్తారనే సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఇంకోవైపు కేంద్ర కేబినెట్‌లో సహాయ మంత్రి పదవి అజిత్ పవార్ పార్టీ నుంచి గెలిచిన ఒకే ఒక్క ఎంపీకి కేటాయిం చేందుకు మోదీ సుముఖత వ్యక్తం చేశారు. కానీ ఆ పదవి తీసుకునేందుకు అజిత్ పవార్ ససేమేరా అన్నారు. అయితే సునేత్ర పవార్‌ను రాజ్యసభకు పంపి.. తద్వారా మోదీ కేబినెట్‌లో ఆమెకు కీలక మంత్రి కేటాయించే లక్ష్యంతో అజిత్ పవార్ పావులు కదుపుతున్నారని సమాచారం. ఇక సునేత్రకు రాజ్యసభ సీటు కేటాయింపుపై ఆ పార్టీలోని కీలక నేత, మంత్రి చగన్ భుజబల్ సైతం తీవ్ర అసహనంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన సైతం ఆ పార్టీకి రాజీనామా చేసి.. శరద్ పవార్ పార్టీలో చేసే అవకాశాలు బలంగా ఉన్నాయి. అయితే శరద్ పవార్‌తో చగన్ భుజబల్ మంగళవారం భేటీ కావడం గమనార్హం. దీంతో ఆయన సైతం అజిత్ పార్టీకి రాజీనామా చేయడం ఖాయమనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతుంది.

# గందరగోళంగా రుణమాఫీ గైడ్‌లైన్స్

## మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,జూలై 17 : రుణమాఫీపై గైడ్‌లైన్స్ గందరగోళంగా ఉన్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీకి ఇన్ని ఆంక్షలు ఎందుకు పెట్టారని నిలదీశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఒకే విడతలో రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. రైతులందరికీ అందరికీ ఒకే విడతలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై రేవంత్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని నిరంజన్ రెడ్డి అన్నారు. కరోనా విపత్తులోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.29వేల కోట్ల రుణాలు మాఫీ చేసిందన్నారు. ఏదో కొంతమందికి రుణమాఫీ చేసి సంబరాలు చేసేందుకు సిద్ధపడకండి అని హితవు పలికారు. పట్టాదారు పుస్తకం ఉన్న ప్రతి ఒక్కరి బ్యాంక్ అకౌంట్‌లో రుణమాఫీ డబ్బులు వేయాలని.. లేకపోతే రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ మోసం చేసినట్లే అని అన్నారు.

పాస్‌బుక్ ప్రామాణికం అయినప్పుడు రైతు భరోసా ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఆంక్షలను చెప్పలేదని, మేనిఫెస్టోలో పెట్టలేదని నిరంజన్ రెడ్డి అన్నారు. ఆంక్షలు లేకుండా అందరికీ రుమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# 8కోట్ల ఉద్యోగాలిచ్చారా..ఎక్కడ?

## ట్విట్టర్ వేదికగా ప్రశ్నించిన ప్రియాంక

న్యూఢిల్లీ,జూలై 17 : దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా మరోసారి గళాన్ని వినిపించారు. కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పించామని ప్రధాని మోదీ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న ప్రయత్నమన్నారు. ముంబయి ఎయిర్‌పోర్టులో 'ఎయిర్ ఇండియా' రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు నిరుద్యోగుల వెల్లువ ఘటనను ప్రస్తావిస్తూ.. 'ఎక్స్' వేదికగా మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఇప్పటివరకు ఎన్డీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 8 కోట్ల ఉద్యోగాలు కల్పించి రికార్డు సృష్టించిందని ప్రధాని ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో చెప్పారు. అవన్నీ అసత్య ప్రచారాలే. తాజాగా ముంబయి ఎయిర్‌పోర్టులో ఉపాధి కోసం నిరుద్యోగులు భారీగా తరలివెళ్లారు. ఈ పరిస్థితి దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య తీవ్రతకు అర్థం పడుతోంది.' అని విమర్శించారు. బూటకపు వాగ్దానాల ద్వారా ప్రజల దృష్టిని మళ్లించకండి. దయచేసి యువతకు కొత్త అవకాశాలు కల్పించండి' అని కేంద్రాన్ని ఆమె కోరారు.

# దుబాయ్ యువరాణి షేఖా మహ్రా బిన్త్ సంచలన ప్రకటన

## భర్తకు విడాకులు ఇస్తూ ఇన్‌స్టా వేదికగా ట్రిపుల్ తల్లాక్

దుబాయ్,జూలై 17 : దుబాయ్ యువరాణి షేఖా మహ్రా బిన్త్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ (30) ఓ సంచలన ప్రకటన చేసింది. ఇన్‌స్టాగ్రామ్ మాధ్యమం ద్వారా తన భర్త షేక్ మనా బిన్ హమమ్మద్ బిన్ రషీద్ బిన్ మనా అల్ మక్తూమ్‌కి (30) విడాకులు ఇచ్చింది. ఇస్లాం మతం ప్రకారం.. ట్రిపుల్ తలాక్‌తో విడాకులు ఇస్తున్నట్లు ఆమె ఇన్‌స్టాలో పోస్టు పెట్టింది. అంతేకాదు.. తాను విడాకులు ఇవ్వడానికి గల కారణం ఏంటో కూడా ఆ పోస్టులోనే రివీల్ చేసింది. ఇతర సహచరులతో బిజీగా ఉన్నారు కాబట్టి, ఈ విడాకులు ప్రకటిస్తున్నానని ఆమె బాంబ్ పేల్చింది. ప్రియమైన భర్త.. మీరు ఇతర సహచరులతో ఎక్కువ కాలం గడుపుతున్నారు. కాబట్టి.. మీకు విడాకులు ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. నేను మీకు విడాకులు ఇస్తున్నా.. నేను మీకు విడాకులు ఇస్తున్నా.. నేను మీకు విడాకులు ఇస్తున్నా (ట్రిపుల్ తలాక్. ఇకపై మీరు జాగ్రత్తగా ఉండండి.. ఇట్లు మీ మాజీ భార్య' అంటూ షేఖా మహ్రా ఆ ఇన్‌స్టా పోస్టులో రాసుకొచ్చింది. వీళ్లిద్దరు విడిపోతున్నారని గత కొన్ని రోజుల నుంచే పుకార్లు షికారు చేస్తున్నాయి. ముఖ్యంగా.. తన కూతురితో ఓ ఫోటో పోస్టు చేసి, 'ఇద్దరం మాత్రమే' అంటూ క్యాప్షన్ పెట్టినప్పుడు ఆ రూమర్లు ఊపందుకున్నాయి. ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేసుకోవడంతో పాటు తమతమ ఫోటోలు కూడా డిలీట్ చేశారు. ఇప్పుడా రూమర్లను నిజం చేస్తూ.. మహ్రా విడాకులు ప్రకటించింది. దిలావుండగా.. దుబాయ్‌లో ప్రముఖ వ్యాపారవేత్త అయిన షేక్ మనా బిన్ మహమ్మద్‌తో షేఖా మహ్రాకు గతేడాది మే నెలలో వివాహం జరిగింది. వీళు పెళ్లి చేసుకున్న రెండు నెలల తర్వాత.. ఈ జంటకి ఓ పండంటి కుమార్తె పుట్టింది. బిడ్డ పుట్టినప్పుడు.. ఇది తమ జీవితంలో ఎంతో అద్భుతమైన క్షణాలు అంటూ సోషల్ మీడియాలో తమ భావోద్వేగాలను కూడా పంచుకున్నారు. ఇంతలోనే ఏమైందో ఏమో తెలీదు కానీ.. వీళ్లిద్దరి మధ్య దూరం పెరగడం, అది విడాకుల దాకా రావడం జరిగింది. కాగా.. షేఖా మహరా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్, ప్రధాన మంత్రి, దుబాయ్ పాలకుడి కుమార్తె. యూఏఈలోని డిజైనర్లు, మహిళల హక్కుల కోసం పోరాడే ధీర వనిత.

# ఆచూకీ లేని నరసాపురం ఎంపిడివో

## ముమ్మరంగా గాలింపు చేపట్టిన పోలీసులు

## సూసైడ్ నోట్ పంపడంపై కుటుంబ సభ్యుల ఆందోళన

భీమవరం,జూలై 17 : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో వెంకటరమణరావు అదృశ్యంపై కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈనెల 15న రాత్రి 10గంటలకు అదృశ్యమైన ఆయన వివరాలు నేటి వరకూ తెలియకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటరమణరావు అదృశ్యంపై ఇప్పటికే పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. సంఘటనపై నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సైతం స్పందించారు. ఎంపీడీవో వెంకరమణరావు క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. నరసాపురం మాదవాయిపాలెం రేవుపాట వ్యవహారమే ఆయన వెళ్లిపోవడానికి కారణంగా భావిస్తున్నాం. ఆయన విషయంలో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే రేవు పాటదారుడు చినరెడ్డప్ప ధవేజీ, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, జేఏసీ సభ్యులుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఫెర్రీ కాంట్రాక్టర్ రూ.54లక్షలు బకాయి ఉండడంతో అధికారులు ఆయనపై ఒత్తిడి తెచ్చారు. దీని వల్లే ఆయన వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. బాధితుడి కుటుంబానికి ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుంది. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా' అని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ చెప్పారు. ఈనెల 15న రాత్రి మచిలీపట్నం రైల్వేస్టేషన్ వద్ద ద్విచక్రవాహనం ఉంచి ఎంపీడీవో వెంకటరమణరావు టికెట్ తీసుకుని రైలు ఎక్కినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా తెలిసినట్లు పోలీసులు వెల్లడించారు. దీనికి సంబంధించిన సీసీ ఫుటేజ్ లభ్యమైనట్లు చెప్పారు. అనంతరం ఆయన విజయవాడ మధురానగర్ వద్ద రైలు దిగినట్లు తెలిపారు. ఎంపీడీవో ఫోన్ సిగ్నల్ ముత్యాలంపాడు వరకు వచ్చి ఆగిపోయినట్లు పేర్కొన్నారు. సమీపంలోనే ఏలూరు కాలువ ఉండడంతో అనుమానంతో అక్కడ గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పుకొచ్చారు. అయితే 16వ తేదీన 'ఈ రోజు నా పుట్టిన రోజు. నేను చనిపోయే రోజు కూడా' అదే అంటూ ఆయన కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్‌లో పంపిన మెసేజ్‌తో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. అయితే దీనిపై స్పందించేందుకు మాత్రం బాధితులు ఇష్టపడలేదు. పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినందున, వారి నుంచే సమాచారం తీసుకోవాలని మీడియాకు చెప్పారు.

తాను సూసైడ్ చేసుకుంటున్నట్లు కుటుంబసభ్యులకు ఎంపీడీవో వాట్సాప్‌లో నోట్ పంపారు. మాజీ విప్ ప్రసాదరాజు ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోటింగ్ కాంట్రాక్టర్‌ను రూ.55లక్షలు ఫెర్రీ లీజు బకాయిలు చెల్లించాలని అడిగితే బెదిరిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. గత చీఫ్ విప్ ప్రసాదరాజు అండదండలతోనే వారు డబ్బులు చెల్లించలేదని, గత మూడున్నర నెలల నుంచి నిందితులు తీవ్రంగా ఇబ్బందులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఏ తప్పూ చేయకపోయినా మానసిక క్షోభ అనుభవిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. బకాయిలు రికవరీ చేయకపోవడం వల్ల తనను బాధ్యుడిని చేసే అవకాశం ఉందని, తనకు ఉద్యోగమే జీవనాధారం అంటూ బాధను వెల్లగక్కారు. నిందితులు బకాయి డబ్బు చెల్లించేలా చూసి న్యాయం చేయాలంటూ ఆయన లేఖలో కోరారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకటరమణరావు విజయవాడ సమీపం కానూరు మహదేవపురం కాలనీలో ఉంటున్నారు. నరసాపురంలో ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన ఈనెల 10నుంచి 20వరకు సెలవులు పెట్టి సొంతూరు వచ్చారు. ఈనెల 15న మచిలీపట్నం వెళ్తున్నానంటూ కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి 10గంటలకు వారికి ఫోన్ చేసి తాను ఇవాళ రావడం కుదరదంటూ చెప్పారు. దాని తర్వాత ఆయన ఎటు వెళ్లారో ఎవరికీ తెలియలేదు. అయితే దానికి ముందు అర్ధరాత్రి సమయంలో 16వ తేదీ తన పుట్టిన రోజని, అదే రోజు తాను చనిపోతున్నట్లు మెసేజ్ చేశారు. ఆందోళన చెందవద్దని కుటుంబసభ్యులకు చెప్పారు. దీంతో ఒక్కసారిగా భయాందోళనలకు గురైన వారు మంగళవారం రోజున పెనమలూరు పోలీసులకు ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎంపీడీవో వాహనాన్ని మచిలీపట్నం రైల్వేస్టేషన్ వద్ద గుర్తించారు. ఆయన ఫోన్ పనిచేయకపోవడంతో విజయవాడ, మచిలీపట్నంలో గాలింపు చర్యలు చేపట్టారు.

# కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ,జూలై 17 : మధ్యంతర బెయిల్, సిబిఐ అరెస్ట్‌ను సవాలు చేస్తూ దాఖలైన కేజ్రీవాల్ పిటిషన్‌లపై ఢిల్లీ హైకోర్టు బుధవారం తీర్పు రిజర్వ్ చేసింది. సిబిఐ అరెస్ట్‌ను సవాలు చేయడమే కాకుండా, ఈ కేసులో బెయిల్ జారీ చేయాలని కేజ్రీవాల్ తరపు న్యాయవాది కోర్టును కోరారు. మొహరం సందర్భంగా సెలవు అయినప్పటికీ.. ఇరు పక్షాల వాదనలను విన్న జస్టిస్ నీనా బన్సాల్ కృష్ణన్ తీర్పును రిజర్వ్ చేశారు.
÷గ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణను ఢిల్లీ హైకోర్టు జులై 29కి జాబితా చేసింది.

# యువతితో కండక్టర్ అసభ్య ప్రవర్తన

## అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,జూలై 17 : ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన ఆర్టీసీ బస్ కండక్టర్‌ను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫరూఖ్‌నగర్ డిపోకు చెందిన బస్సులో పుప్పాలగూడ నుంచి హియాయత్‌నగర్‌కు ప్రయాణిస్తున్న యువతితో బస్సు కండక్టర్ మణికొండ వద్ద అసభ్యంగా ప్రవర్తించాడు. ప్రయాణ సమయంలో ఒక కండక్టర్ తనతో ప్రవర్తించిన తీరు సరిగా లేదని యువతి సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. దీనిపై స్పందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం కండక్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి రాయదుర్గం సీఐ వెంకన్న మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కండక్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు చెప్పారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 18 జూలై 2024





# రైతుకు నష్టం జరిగితే చూస్తూ ఊరుకోం

## మాజీమంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్,జూలై 17 : కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రైతులకు నష్టం జరిగితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడు తూ.. తెలంగాణ ఉన్నన్ని రోజులు రాష్ట్ర సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్ పేరును ప్రజలు మర్చిపోరన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు రైతుల కష్టాలను సీఎం దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. పార్టీలో చేరి కలపై ఉన్న శ్రద్ధ ప్రజలకు అందించే పాలనపై సీఎం రేవంత్‌రెడ్డికి లేదని దుయ్యబట్టారు. అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టిన కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించే రోజు దగ్గరలోనే ఉందన్నారు. రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి రైతులను తొలగించేందుకు కొర్రీలు పెడుతున్నారన్నారు. ప్రస్తుత నిబంధనలు చూస్తే కనీసం 50 శాతం రైతులకు కూడా రుణమాఫీ కాదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. కేసీఆర్‌ను అభాసుపాలు చేయాలనే కుట్ర కోణంతోనే సీఎం రేవంత్‌రెడ్డి కాలం వెళ్లదీస్తున్నాడని, సుప్రీం కోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. అంగన్‌వాడీలకు గుర్తింపు తీసుకువచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమన్న విషయాన్ని ఆ శాఖ మంత్రి సీతక్క మర్చిపోవద్దన్నారు. అంగన్‌వాడీలకు రూ. 13 వేల వేతనం తో పాటు పదవీకాలం ముగిస్తే రూ. 2 లక్షలు ఇవ్వాలనే జీవోను తీసుకువచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వ మన్నా రు. ఎన్నికల కోడ్‌తో ఆ జీవో బయటకు రాలేదని, అది కూడా కాంగ్రెస్ చేసినట్లు చెప్పుకోవడం శోచనీయ మన్నారు. అలాగే కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలో నిరంకుశ పాలన కొనసాగుతున్నదన్నారు.

# భీమిలి ఎర్రమట్టి తవ్వకాలకు అనుమతి లేదు

## ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టీకరణ

విశాఖపట్నం,జూలై 17 : పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న భీమిలి బీచ్ రోడ్డులోని ఎర్రమట్టి దిబ్బలు రోజురోజుకూ తరిగిపోతున్నాయి. రాత్రివేళల్లో తవ్వకాలు జరిపి మట్టి, ఇసుక తరలించుకుపోతున్నారు. గతంలో చిన్న చిన్న వ్యాన్లలో, మినీ ఆటోల్లో మట్టి తీసుకుపోతుండేవారు. ఇప్పుడు ఏకంగా జేసీబీలతోనే తవ్వకాలు చేపట్టినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఎర్రమట్టి దిబ్బలు సుమారు 1,195 ఎకరాల్లో విస్తరించి ఉండగా, వీటిలో 292 ఎకరాలను జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించింది. పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఎర్రమట్టి దిబ్బలు కరిగిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలపై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మీడియాకు పలు కీలక విషయాలు వెల్లడించారు. ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలకు కూటమి ప్రభుత్వం ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. భీమిలి ఎర్రమట్టి దెబ్బలను బుధవారం పరిశీలించారు. భీమిలి కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా తవ్వకాలు జరుగుతున్నాయని అన్నారు. తమ ప్రభుత్వం కేటాయించిందని సొసైటీ సభ్యులు చెబుతున్నారని.. తవ్వకాల సంబంధించినంత వరకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తేల్చిచెప్పారు. గత ఆరు నెలల నుంచి తవ్వకాలు జరుగుతున్న అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. ఈ విషయంపైన కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేయాలని కోరామని అన్నారు. అసలు ఎర్రమట్టి దిబ్బకు సంబంధించి ఒక ఎక్స్‌పర్ట్ కమిటీ కూడా వేస్తామని.. వాటి పరిధిని కచ్చితంగా నిర్ణయిస్తామని ప్రకటించారు. ఒకవేళ అవసరమైతే ప్రభుత్వమే ప్రత్యామ్నాయం ఆలోచించి దీన్ని టూరిజం పరంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం పనులన్నీ నిలుపుదల చేశారని అన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా దీనిపైన ఒక నిర్ణయం తీసుకుంటుందని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# మహనీయుల బాటలో నడుద్దాం

## ఏకలవ్య జయంతిలో శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,జూలై 17 : మహనీయుల బాటలో నడుద్దామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపు నిచ్చారు. పండుగ సాయన్న, ఏకలవ్య జయంతి వేడుకల్లో భాగంగా మహబూ బ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఉన్న విగ్రహాలకు బుధవారం ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డితో కలిసి శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే హన్వాడ మండలకేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఆలో చనతో కేసీఆర్ హయాంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్‌లో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. వారు సమాజం కోసం చేసిన సేవలను నేటి యువత అందిపుచ్చుకోవాలన్నారు. గొప్ప వారిని ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, పండుగ సాయన్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో టోకరా

## ఖమ్మం జిల్లా వాసి అరెస్ట్


హైదరాబాద్,జూలై 17 : మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తిని దారుణంగా మోసం చేశారు సైబర్ క్రైమ్ నిందితుడు. బాధితుడి వద్ద నుంచి ఏకంగా 5.7 లక్షలు కాజేశారు. ఈ కేసులో ఒకరిని అరెస్ట్ చేయగా.. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. హైదరాబాద్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాధితుడు జగదీష్ హైదరాబాద్‌లో నివాసముంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, ఇంతలో గుర్తు తెలియని వ్యక్తి కాల్ చేసి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ఉద్యోగం ఉందని.. పనితీరు నచ్చితే మల్టీనేషన్ కంపెనీలో ఉద్యోగం కల్పిస్తామంటూ నమ్మబలికారు. అది నమ్మిన బాధితుడు.. అతను చెప్పిన ప్రతీది చేశాడు. అలా మొత్తం రూ. రూ. 5,73,208 నిందితులకు సమర్పించుకున్నాడు. చివరకు తాను మోసపోయినట్లు గ్రహించి.. సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడు బిందె పవన్ కళ్యాణ్ ఖమ్మం జిల్లాలోని ఇల్లందు వాసిగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతనిపై కేసులు నమోదు చేశారు. నిందితుడు గతంలో ఇంటర్నెట్ కేఫ్ నడిపేవాడని.. డబ్బును సంపాదించే ఉద్దేశంతో చెడుమార్గంలో నడిచాడని పోలీసులు వివరించారు. ఈ క్రమంలోనే 'టీక్యూఆర్ కంపెనీ' పేరుతో ప్రజలకు ఫోన్ చేసి.. ఉద్యోగం పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

# కేదార్‌నాథ్ ఆలయాన్ని పోలిన ఆలయం

## ఎల్లంపేటలో భూమిపూజ చేసిన ఈటెల

హైదరాబాద్,జూలై 17 : ఉత్తరాదిన ఎంతో విశిష్టత కలిగిన దేవాలయాన్ని తెలంగాణలో అందులోనూ హైదరాబాద్ లో నిర్మించబోతున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదార్ నాథ్ ఆలయాన్ని పోలి ఉండేలా ఒక ఆలయాన్ని నిర్మిస్తున్నారు. మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో బుధవారం ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య, కమల్ నారాయణదాసు మహారాజ్ లు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ ఏసీబీ బి. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉత్తర భారత దేశంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన కేదార్ నాథ్ ఆలయాన్ని ఇక్కడ నిర్మించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. చార్ థామ్ యాత్రకు వెళ్లేందుకు వీలుకాని వారెవరైనా ఇక్కడ నిర్మించబోతున్న కేదార్నాథ్ ఆలయాన్ని దర్శించుకోవచ్చని అన్నారు.

# నైనీ బ్లాక్‌లో వేగంగా బొగ్గు తవ్వకాలు



### నాలుగు నెలల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలి

### అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి ఆదేశాలు

హైదరాబాద్,జూలై17 : సింగరేణి సంస్థకు ఒడిశాలో కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించి మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. నాలుగు నెలల్లో గని నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశర చేశారు. బుధవారం సచివాలయంలో ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్, ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నైనీ బొగ్గు బ్లాక్‌పై చర్చించారు. సింగరేణి తొలిసారిగా తెలంగాణ వెలుపల చేపడుతున్న ప్రాజెక్టు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వ, కంపెనీ ప్రతిష్ఠను పెంచేలా మైనింగ్ చేపట్టాలన్నారు. స్థానికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని కోరారు. ఒడిశా రాష్ట్ర అటవీ శాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పనులు వేగంగా పూర్తయ్యేలా చొరవ చూపాలని సింగరేణి సంస్థను ఆదేశించారు. నైనీ బ్లాక్ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి. వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. హైటెన్షన్ విద్యుత్తు లైన్‌ను వెంటనే నిర్మించే విధంగా ఒడిశా విద్యుత్ శాఖతో సంప్రదిస్తూ ముందుకు సాగాలి. పునరావాస, నష్టపరిహారం అంశాలపై చర్చించే ఆర్‌పీడీఏసీ మీటింగ్‌ను అతి త్వరగా పూర్తి చేసుకోవాలి. 2015లో సింగరేణికి నైనీ బొగ్గు బ్లాక్‌ను కేటాయించినప్పటికీ గత ప్రభుత్వ నిరాసక్తత వల్ల ఇప్పటికీ ఉత్పత్తి ప్రారంభం కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి సింగరేణిపై ఉన్న ప్రత్యేక చొరవ కారణంగా నేను స్వయంగా ఒడిశా వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో అన్ని సమస్యల పరిష్కారానికి చర్చించాను' అని భట్టి విక్రమార్క తెలిపారు. సమావేశంలో సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ మాట్లాడుతూ.. సమావేశంలో సూచించిన ప్రకారం ప్రతి పనికి నిర్దేశిత కాలపరిమితిని విధించుకొని పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వివరించారు.

# కాంగ్రెస్ హామీలకు గ్యారెంటీ!

ఒక్కో హామీని నెరవేర్చుకుంటూ వెళుతున్న కారణంగా కాంగ్రెస్ మెల్లగా పట్టాలకు ఎక్కుతోంది. కాంగ్రెస్ హామీలకు గ్యారెంటీ వస్తోంది. ఒక్కో హామీని నెరవేర్చే క్రమంలో అత్యంత ముఖ్యమైన రుణమాఫీని ఎట్టకేలకు పట్టాలకు ఎక్కిస్తున్నారు. అలాగే మిగతా హామీలకు కూడా గ్యారెంటీ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే

అంతర్గ శతృత్వం లేకుండా మంత్రులంతా కలసి నడుస్తున్నారు. అభివృద్ధి సంక్షేమం సమపాళ్లుగా ముందుకు సాగుతున్నారు. రైతురణమాఫీ కీలక అడుగుగా భావించాలి. లక్ష వరకు రుణాలకు నేడు ఖాతాల్లో జమ కానున్నాయి. కెసిఆర్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన రుణమామీ నెరవేరలేదు. పదేళ్ల పాటు డొల్ల మాటలతో, మసిపూసి మారేడుకాయ చేశారు. అయినా ఒక్కో అవినీతి బయటపడుతున్న కొద్దీ కాంగ్రెస్‌పై ఎదురుదాడి తో తమ అవినీతి, అక్రమాలను, బంధుప్రీతిని కప్పిపుచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఏపని చేసినా విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఇకపోతే రుణమాఫీకి స్పష్టమైన విధానాలు ప్రకటించారు. రతుభరోసా విషయంలో కూడా స్పష్టమైన విధానాలతో ముందుకు సాగుతున్నారు. రైతురుణ మాఫీ విషయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్న సిఎంగా రేవంత్ ముందుంటారు. అందులోనూ అర్మలకే రుణమాఫీ ఇవ్వడం ఆహ్వానించదగ్గ విషయం. పంట రుణాల మాఫీ విషయంలో రేషన్‌కార్డు నిబంధనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. పాస్‌బుక్ ఆధారంగానే రూ.2లక్షల రుణమాఫీ ఉంటుందని వెల్లడించారు. కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు నిబంధన పెట్టినట్లు చెప్పారు. ఈ నెల 18న రూ.లక్ష లోపు తొలుత రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు.సాయంత్రంలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. రుణమాఫీ సంబురాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాల ను విడుదల చేసింది. అన్ని షెడ్యూల్డు, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార బ్యాంకుల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువలైన రుణాలకు, 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు, స్వల్పకాలిక రుణాలకు ఇది వర్తిస్తుందని... రుణాల అసలు, దానికి వర్తించే వడ్డీని కలిపి రూ.2 లక్షలు మాఫీ అవుతాయని ప్రభుత్వం తెలిపింది. అయితే తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్టు ప్రకటించటంతో విపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. రేషన్ కార్డు లేని వారికి ఆధార్ కార్డు ప్రమాణికంగా రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపింది. అయితే..రుణమాఫీ మార్గదర్శకాల విడుదల అనంతరం రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి..

షరతుల్లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి ఇదేంటంటూ అటు బీఆర్ఎస్ ..ఇటు బీజేపీ .. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్ అవుతున్నాయి.. రైతులను రెచ్చగొడుతున్నాయని.. అర్హులందరికీ రుణమాఫీ చేసి తీరుతామని అధికార పార్టీ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే రుణమాఫీకి రేషన్ కార్డు నిబంధనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ సైతం క్లారిటీ ఇచ్చారు. భూమి పాస్ బుక్ ఆధారంగానే కుటుంబానికి రూ.2లక్షల పంట రుణమాఫీ చేస్తామన్నారు. కేవలం కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమే రేషన్ కార్డు నిబంధన పెట్టామన్నారు. రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఇతర ఖాతాల్లో జమచేసుకుంటే బ్యాంకర్ల పైన కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడిచింది. ఇదిలావుంటే రుణమాఫీ మార్గదర్శకాలపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది.. ఆంక్షల పేరుతో రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని.. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవడం సరికాదంటూ పేర్కొంది. షరతులు లేకుండా రుణమాఫీని అమలు చేయాలని

డిమాండ్ చేశారు. మొత్తంగా రుణమాఫీ ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని.. పీఎం కిసాన్ నిబంధనలు వర్తింపుతో రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. పీఎం కిసాన్ రూల్స్‌తో సగం మంది రైతులకే మాఫీ జరుగుతుందన్నారు. రైతుల సంఖ్యను కుదించడమే..ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోందని అన్నారు. మొత్తంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు పక్కాగా కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. బిఆర్ఎస్ లాగా దంబాచారాలకు పోవడం లేదు. అదేపనిగా ప్రచారాంతో పక్కదారి పట్టించే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ ÷-రమంలో బిఆర్ఎస్ డొల్ల బయటపడడంతో ఎమ్మెల్యేలు కూడా ఇక పార్టీలో ఉండి లాభం లేదన్న రీతిలొఓ ఆలోచన చేస్తున్నారు. అందుకే బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు ఒకకొక్కరుగా అధికార కాంగ్రెస్‌లోకి జారుకుంటున్నారు. దీంతో ఆ పార్టీ తట్టుకోలేక పోతున్నది. ఉన్న నలుగురు రాజ్యసభ ఎంపిలను కూడా బిజెపికి అప్పగించే పనిలో బిఆర్ఎస్ ఉన్నట్లు వార్తలు గుప్పుమంటు న్నాయి. అవసరాల కోసం బిఆర్ఎస్ ఏమైనా చేస్తుందనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరం లేదు. ఇకపోతే తెలంగాణ కాంగ్రెస్ చేరికలతో కళకళలాడుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారిగా పార్టీకి ఎనలేని జోష్ వచ్చింది.. మునుపటిలా కొట్లాటల్లేవ్.. నేతలంతా ఒక్కటై కలిసిమెలిసి.. ఎట్టి పరిస్థితుల్లో కేసీఆర్‌ను,బిఆర్ఎస్‌ను ఎదగకుండా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలను,ఎమ్మెల్యేలను చేర్చుకుంటూ ముందుకెళ్తున్నారు. అయితే చేరికలతో జగిత్యాల నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కొంత బెట్టుసరి ప్రదర్శించారు. నిజంగానే కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి బీజేపీ తీర్థం పుచ్చుకోబోతున్నారనే ప్రచారం సాగింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతో పాటు కేసీ. వేణుగోపాల్‌ను కూడా కలిసి.. చర్చించారు. అంతేకాదు.. మునుపటితో పోలిస్తే కాంగ్రెస్‌కు చాలా గ్రాఫ్ పెరిగిందని కూడా చెప్పుకొచ్చారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ఆశ్చర్యపడేలా చేరికలు ఉంటాయని కూడా చెప్పుకొచ్చారు. ఇప్పటికైతే కాంగ్రెస్‌లో కుమ్ములాటలు తగ్గాయ్.. అసంతృప్తులు కూడా తగ్గారు.. ఇక చేరికల తర్వాత పరిస్థితి ఎలా ఉంటుంది..? పార్టీలో ఉన్న సీనియర్లు, సిట్టింగ్‌లు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు.. అనేది వేచి చూడాల్సిందే మరి. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వెనుకబాటు, వివక్షతకు గురైందని, స్వరాష్ట్రం సాధించుకున్నాకనే సిఎం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ మరింతగా వివక్షకు గురయ్యిందని, ఇప్పుడు సి

ఎం రేవంత్ రెడ్డి తెలంగాణను అగ్రరాష్ట్రంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నారని అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం చెప్పుకుంటున్నారు. దీనిని జీర్ణించుకోలేని బిఆర్ఎస్, బిజెపి నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రజల్లో ఉనికి కోసం విపక్షాలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. దేశమంతా తెలంగాణ వైపు చూస్తుందని తెలిపారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధిపొందే విధంగా సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవు తున్నాయన్నారు.

# ఆలయాల్లో తొలి ఏకాదశి రద్దీ

## వేకువ జామునుంచే భక్తుల రాక

హైదరాబాద్,జూలై 17 : తొలి ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవ, వైష్ణవ ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. తెలంగాణలోని ధర్మపురి, వేములవాడు, కొమురవెల్లి, యాదాద్రి వంటి ప్రముఖ ఆలయాలకు భక్తుల తాకిడి నెలకొంది. బుధవారం తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో పలు ఆలయాలకు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పుణ్య స్నానాలు ఆచరించి ఆలయంలో దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ దైవ స్మరణలో నిమగ్నమవుతారు. అటు ఎపిలోనూ ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శ్రీశైలం మల్లన్న, విజయవాడ కనకదుర్గ, సింహాచలం వంటి పుణ్య క్షేత్రాలకు భక్తులు చేరుకుని దర్శించు కున్నారు. కాగా ఏకాదశి సందర్భంగా రెండు రాష్ట్రాల్లోని ప్రముఖ ఆలయాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాటు చేశారు. భక్తుల రద్దని దృష్టిలో పెట్టుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

# నీతి ఆయోగ్‌లోకి రామ్మోహన్ నాయుడు

## ప్రత్యేక ఆహ్వానితుడిగా నియామకం

న్యూఢిల్లీ,జూలై 17 : నీతి అయోగ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు నియమితులయ్యారు. కేంద్రంలో కొత్త మంత్రివర్గం ఏర్పడిన నేపథ్యంలో నీతి అయోగ్ కూర్పును సవరించారు. ఎక్స్ అఫీషియో సభ్యుల జాబితాలో కొత్త వ్యవసాయ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను చేర్చారు. ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలో మంత్రులు జేపీ నడ్డా (వైద్య ఆరోగ్యం), కింజరాపు రామ్మోహన్ నాయుడు (పౌర విమానయానం), హెచ్‌డీ కుమారస్వామి (ఉక్కు, భారీ పరిశ్రమలు), జితన్‌రాం మాంఝీ (ఎంఎస్ఎంఈ), రాజీవ్ రంజన్ సింగ్ (పంజాయతీరాజ్, పశుసంవర్ధకం), జూయెల్ ఓరం (గిరిజన వ్యవహారాలు), అన్నపూర్ణాదేవి (మహిళా శిశు సంక్షేమం), చిరాగ్ పాశ్వాన్ (ఆహారశుద్ధి పరిశ్రమలు) ను చేర్చారు.

# చురుకుగా మహా గణపతి పనులు

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్,జూలై 17 : ఖైరతాబాద్ మహా గణపతి పనులు చురుకుగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఈ ఏడాది గణేశ్ నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ రోజు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మహా గణపతి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితికి స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షుడిగా ఉంటారని తెలిపారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. రెండు కమిటీ ఆలోచనలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. అందరూ ఉత్సవ కమిటీ సభ్యులేనని దానం నాగేందర్ అన్నారు. కులమతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రాబోయే రోజుల్లో గిన్నిస్ రికార్డ్స్‌లోకి ఎక్కబోతున్నామని.. దీనిని బాధ్యతగా భావించి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మా మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని తెలిపారు. అడ్‌హాక్ పేరుతో ఖైరతాబాద్ గణేశ్ కొత్త ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. డొనేషన్స్ నుంచి వచ్చే డబ్బును రోజూ డిస్‌ప్లే చేస్తామన్నారు. విద్యా, ఆర్థిక స్థోమత లేని వారికీ సహాయం అందిస్తామన్నారు. మల్టి పర్పస్ కమ్యూనిటి హాల్ కట్టబోతున్నా మని దానం నాగేందర్ వెల్లడించారు. ఇక్కడ ఖైరతాబాద్ వాసులు నామినల్ ఫీ కట్టి హాల్‌ను వినియోగించు కునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అడహక్ కమిటీకి తాను అధ్యక్షుడిగానూ.. రాజ్ కుమార్ చైర్మన్ గానూ ఉంటారని తెలిపారు. అడ్ హాక్ ఉత్సవ్ కమిటీలో 100 మంది సభ్యులు ఉంటారని తెలిపారు. కమిటీ సభ్యులకు ఐడి కార్డు ఉంటుందని వెల్లడించారు. ఉత్సవ కమిటీ సభ్యులంతా సమానమేనన్నారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ్ కమిటీ , శ్రీ గణేశ్ ఉత్సవ్ కమిటీ మధ్య విభేదాల నేపథ్యంలో అడ్ హాక్ పేరుతో కొత్త కమిటీ ఏర్పాటు చేశామని దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఇక ఖైరతాబాద్ గణేశుని వద్ద ప్రతి రోజూ ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. పోలీసులు, మీడియా వలంటీర్స్‌కు భోజనాలను ఏర్పాటు చేస్తామన్నారు. బోనాల ఫెస్టివల్ తర్వాత ధూప దీపాలకు నోచుకోని అన్ని టెంపుల్స్‌కి కమిటీలు ఏర్పాటు చేయబోతున్నామని దానం నాగేందర్ వెల్లడించారు.

# ముగ్గురిని బలిగొనన ఈత సరదా

## ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం

సూర్యాపేట,జూలై 17 : సూర్యాపేట జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఈత సరదా ముగ్గురు ప్రాణాలను బలి తీసుకుంది. క్వారీ గుంతలో ఈతకు వెళ్లిన ముగ్గురు మృతి చెందారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మృతులు శావల్య రాజు (45) అతడి కూతురు శ్రావల్య ఉష (12),శ్రీపాల్ రెడ్డి (40 )గా గుర్తించారు. మృతులు హైదరాబాద్ నుంచి బంధువుల ఇంటికి వచ్చి స్థానిక క్రషర్ గుంతల్లో ఈతకు వెళ్లినట్లు సమాచారం. చుట్టుపు చూపుగా వచ్చి ఒకేసారి ముగ్గురు మృత్యువాత పడటంతో బొప్పారంలో విషాదఛాయలు అలుము కున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సంఘటన సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
18 జూలై
2024





# రుణమాఫీపై రైతులకు తీరనున్న బెంగ

**నేడు బ్యాంక్ ఖాతాల్లో పడనున్న నగదు**

**లక్ష వరకు నేటి సాయంత్రానికి జమ**

**బ్యాంకర్లకు ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం**

**రైతులకు సందేశం ఇవ్వనున్న సిఎం రేవంత్**




హైదరాబాద్,జూలై 17 : రైతు రుణమాఫీ పథకంలో భాగంగా గురువారం సాయంత్రంలోపు రైతుల రుణ ఖాతాల్లో రూ.లక్ష వరకు డబ్బులు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బ్యాంకర్లకు ఆదేశాలు ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీకి ప్రభుత్వం అడుగులు వేసింది. రాష్ట్రంలో 90 లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. 70 లక్షల మంది రైతులకు రుణాలున్నాయి. వీరిలో 6.36 లక్షల మందికి రేషన్‌కార్డులు లేవు. వారికీ రుణమాఫీ వర్తిస్తుంది. రేషన్‌కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వమని కూడా స్పష్టం చేసింది. రుణమాఫీ జరిగే రైతులను రైతువేదికల వద్దకు తీసుకొచ్చి.. ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు వారితో ఆ సంతోషం పంచుకోబోతున్నారు. ఇందుకోసం జిల్లాల్లో పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. రైతు రుణమాఫీకి సంబంధించి సచివాలయంలో రెండు ఉమ్మడి జిల్లాలకు ఒక ఉన్నతాధికారిని అందుబాటులో ఉంచుతాం. కలెక్టర్లకు ఏవైనా సందేహాలు వస్తే వారితో సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా గురువారం సాయంత్రంలోపు రైతుల రుణ ఖాతాల్లో రూ.లక్ష వరకు డబ్బులు జమ చేయాలని

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బ్యాంకర్లకు ఆదేశాలు ఇచ్చింది. అదేరోజు రైతు వేదికల్లో రుణమాఫీ లబ్ధిదారులతో సంబురాలు జరపాలని నిర్ణయించింది. వీటికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. రాష్ట్రంలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకం ఆధారంగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. కేవలం కుటుంబ వివరాలను గుర్తించడానికి మాత్రమే రేషన్‌కార్డు నిబంధన విధించినట్లు మంగళవారం కలెక్టర్లతో నిర్వహించిన సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకం. దీని అమలుపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. ఏ ఒక్క రైతుకూ నష్టం జరగొద్దు. ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా బ్యాంకర్లతో కలెక్టర్లు సమావేశం నిర్వహించాలి. అదేరోజు సాయంత్రం సాయంత్రం 4 గంటలకు రూ.లక్ష వరకు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. ప్రభుత్వం విడుదల చేసే నిధులను రైతు రుణమాఫీకే వాడాలి. వ్యక్తిగత, ఇతర రుణాల మాఫీకి వినియోగించవద్దు. గతంలో కొందరు బ్యాంకర్లు ఇలా చేస్తే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మేమూ ఇప్పుడు అలాగే చేస్తాం అని సీఎం పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు తయారు చేసే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ల సదస్సులో ఆయన ఆదేశించారు. ఇదిలావుంటే గురువారం ఉదయం 10 గంటలకు ప్రజా భవన్ లేదా సెక్రెటరీయేట్‌లో రాష్ట్ర స్థాయి బ్యాంకర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు తదితరులు హాజరుకానున్నారు. లక్ష రూపాయల లోపు రైతు రుణమాఫీ అమలులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై బ్యాంకర్లకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేయనున్నారు. లక్ష రూపాయల లోపు రైతు రుణమాఫీ చేయనున్న నేపథ్యంలో అన్ని మండల కేంద్రాలలో ఉన్న రైతు వేదికల్లో రైతుల సమావేశాలు జరగనున్నాయి. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులనుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సందేశం ఇవ్వనున్నారు. రాష్ట్రంలో రుణమాఫీ అమలులో భాగంగా తొలి విడతగా రూ.లక్ష మేర రుణాలున్న రైతుల ఖాతాల్లో గురువారం నగదు జమ జరగనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల వద్ద రుణమాఫీ లబ్దిదారులతో కలిసి సంబురాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## నెల్లూరులో రొట్టెల పండగ సందడి

**నేడు గంధం కోసం ప్రత్యేక ఏర్పాట్లు**

నెల్లూరు,జూలై 17 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన నెల్లూరు భార షాహిద్ దర్గా రొట్టెల పండుగ సందడి నెలకొంది. పండుగకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు . ప్రతి సంవత్సరం మోహరం తరువాత రోజు రొట్టెల పండుగను నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా 18 నుంచి ఈనెల 21 వరకు పండుగ జరగ నుంది. పండుగలో అత్యంత ముఖ్యమైన గంధం ఈనెల 18 న జరుగనుంది. గంధంకి సంభందించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు.. బారా షాహిద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. మాములుగా మొహారం తరువాత రోజు నుంచి పండుగ ప్రారంభం అవుతుంది. అయితే ప్రతి ఏడాది ఒక రోజు ముందు నుంచే భక్తులు తాకిడి అధికంగా ఉంటుంది. ఈ ఏడాది సైతం పండుగకు ఒక రోజు ముందు నుంచే వేలాది మంది భక్తులు బారా షాహిద్ దర్గాకు తరలి వస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన పండుగకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

## ఏపీలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

**తొలి విడత సీట్ల కేటాయింపు**

అమరావతి,జూలై 17 : ఏపీలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు తొలి విడత సీట్ల కేటాయింపు పక్రియను అధికారులు పూర్తి చేశారు. ఇటీవల తొలి విడత కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు బుధవారం మొదటి రౌండ్ సీట్ల కేటాయింపునకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ మేరకు తమ అధికారిక వెబ్‌సైట్‌లో అలాట్‌మెంట్ ఆర్డర్‌ను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమకు ఏ కాలేజీలో సీటు వచ్చిందో తెలుసుకొనేందుకు హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాల్ని ఎంటర్ చేయాల్సి ఉంటుంది. షెడ్యూల్ ప్రకారం.. ఆయా కాలేజీల్లో సీట్లు పొందిన అభ్యర్థులు 17-22లోపు చేరాల్సి ఉంటుంది. జులై 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

## తిరుమలపై ప్రత్యేక దృష్టి

**పవిత్రతను కాపాడేలా చర్యలు**

**సమర్థులైన అధికారుల నియామకం**

**త్వరలోనే పాలకమండలి కోసం కసరత్తు**

తిరుమల,జూలై 17 : తిరుమల పవిత్రతను కాపాడుతూ..భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా టీటీడీ ప్రక్షాళన దిశగాచంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల ఆలయ ప్రతిష్ఠ మంటగలిపారని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధికారులను మార్చివేస్తోంది. ఇప్పటికే ఈవోగా శ్యామలారావును నియమించగా..ఇప్పుడు జేఈవోగా వెంకయ్య చౌదరిని నియమించింది. ఒక టిటిడి ఛైర్మన్‌తో పాటు, పాలకమండలిని నియమించాల్సి ఉంది. పూర్తి ఆధ్యాత్మికతతో పాటు, అభివృద్ధికి సహకరించే వారిక ఇస్థానం కల్పించే అవకాశం ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానములను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా సీఎం చంద్రబాబు నడుం బిగించారు. వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలకు కేంద్రంగా టిటీడీని మార్చేశారని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం...ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది. అందుకే ఎలాంటి రాజకీయాలతో సంబంధం లేని సీనియర్, సిన్సియర్ అధికారులకు కీలక పదవుల్లో పోస్టింగ్ ఇస్తోంది. తిరుమలకు గత వైభవం తీసుకుని రావడంతోపాటు..కేవలం ఆధ్యాత్మిక వాతావరణం తప్ప ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా తిరుమల కొండలకు పూర్వస్థితిని తీసుకురావాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఈవో ధర్మారెడ్డిని తొలగించింది. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి శ్యామలారావును నియమించింది. ఆయన్ను కేంద్ర సర్వీసుల నుంచి డిప్యూటేషన్‌పై రాష్ట్రానికి రప్పించి కీలకమైన పదవిని కట్టబెట్టింది. గతంలోనూ ఆయన తిరుమల ఈవోగా పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పుడు మరో కీలకమైన జేఈవో పోస్టుల లో సైతం చిరుమామిళ్ల వెంకయ్య చౌదరిని నియమించారు. ఈయన కూడా కేంద్రం నుంచి డిప్యూటేషన్‌పై తీసుకొచ్చారు. చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి మంచి సమర్థవంతమైన అధికారిగా పేరుంది. ప్రస్తుతం కేంద్ర,ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోని కస్టమ్స్ కమిషనరేట్ పరిధిలోని విజయవాడశాఖ కమిషనర్‌గా ఆయన పనిచేస్తున్నారు. ఆయన్ను డిప్యూటేషన్ పై ఏపీకి పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తిని కేంద్రం అంగీకరించింది. డిప్యూటేషన్‌పై మూడేళ్లపాటు పంపేందుకు అంగీకరించింది. దీంతో ఆయన్న తితిదే జేఈవోగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గతంలో ఆయనకు ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా ఎండీగా పనిచేసిన అనుభం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే తిరుమల ప్రక్షాళన దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈవోగా శ్యామలారావు బాధ్యతలు చేపట్టిన వెంటనే దళారుల ఆగడాల ఆటకట్టించారు. విజిలెన్స్ విభాగాన్ని బలోపేతం చేశారు. ఎక్కడికక్కడ దాడులు చేసి దళారులు పారిపోయేలా చేశారు. భక్తులను దోచుకుంటున్న ఉద్యోగులను హెచ్చరించారు. వ్యాపారులను అదుపు చేయడంతోపాటు...సామాన్య భక్తులు స్వామివారిని దర్శించు కునేలా మార్పులు, చేర్పులు చేపట్టారు. కాలినడక భక్తులకు సర్వదర్శనం టోకెన్లు జారీ చేయడంతో పాటు...వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు అన్నీ తెరిపించి భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో క్యూ కాంప్లెక్స్‌లో భక్తులు వేచి ఉంచితే వారికి ప్రసాదం, పాలు, టీ వంటి అదనపు సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని....ఉచిత దర్శనం భక్తులను గంటల తరబడి కిలోమీటర్ల పొడవునా క్యూలైన్లలోనే వేచి ఉంచేలా చేశారు. ఇప్పుడు సర్వదర్శనం భక్తులందరినీ క్యూకాంప్లెక్స్‌లోకి అనుమతిస్తున్నారు. గతంలో మాదిరిగా అక్కడ స్వామివారి ప్రసాదం, చిన్నపిల్లలకు పాలు అందిస్తున్నారు. టిక్కెట్లు జారీ, గదుల కేటాయింపులోనూ పెనుమార్పులు తీసుకురానున్నారు. వేలకోట్ల రూపాయల ఆస్తులు, కోట్లాది మంది హిందూవుల మనోభావాలతో తిరుమల ఆలయం ముడిపడి ఉండటంతో గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలోనే తిరుమల ఈవోగా ఐఏఎస్‌స్థాయి అధికారిని నియమించడం జరిగింది. అయితే వైసీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్మారెడ్డి కోసం ఆ స్థాయిని మళ్లీ తగ్గించింది. తిరుమలకు ఈవో సహా ఇద్దరు జేఈలు ఉండగా....వారిని తిరుపతికే పరిమితం చేసింది. చంద్రబాబు తిరిగి అధికారం చేపట్టడంతో ఈవోగా మళ్లీ ఐఏఎస్ అధికారినే నియమించారు. జేఈవోగానూ ఐఆర్ఎస్ అధికారిని తీసుకువచ్చారు. వీరిరువురూ తిరుమలలోనే పనిచేయనున్నారు. ఇకపోతే మళ్లీ పూర్వ వైభవం రావాలని భక్తులు కూడా కోరుకుంటున్నారు.

## వైసీపీ అరాచక పాలన కారణంగా దివాళా

**అన్ని రంగాల్లో వెనకబడి పోయిన రాష్ట్రం**

**సంపద సృష్టికి సిఎం చంద్రబాబు కృషి**

**రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రయత్నాలు**

**ఢిల్లీలో బిజీగా ఉన్న మంత్రి సత్యకుమార్**

న్యూఢిల్లీ,జూలై 17 : వైసీపీ అరాచక పాలన కారణంగా రాష్ట్రం అన్ని రకాలుగా వెనుకబడిందని ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. తాము సంపద సృష్టిస్తున్నామని.. అందుకే అమరావతి చుట్టూ రహదారుల నిర్మాణం వేగంగా చేపట్టామని వివరించారు. సంపద సృష్టికి కొంత సమయం పడుతుందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం, రాజకీయ వివక్ష లేకుండా ప్రభుత్వ ఫలాలు అందరికీ

అందడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వైకాపా నేతలు అధికారం కోల్పోయి 2 నెలలు కూడా కాకముందే మైండ్ గేమ్ ఆడుతూ రాజకీయ విమర్శలు చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజాతీర్పుపై ఆత్మవిమర్శ చేసుకోకుండా వ్యవహరిస్తున్నారు. జీతాలు ఇవ్వాలి కాబట్టే కొంత అప్పులు తీసుకోవాల్సి వస్తుందని చెప్పారు. ఢిల్లీలో మంత్రి సత్యకుమార్ బిజీ బిజీగా ఉన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ ను సత్యకుమార్ బుధవారం కలిశారు. ఏపీలో రాజకీయ పరిస్థితుల గురించి జేపీ నడ్డాతో చర్చించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సంసిద్ధత గురించి చర్చించామని అన్నారు. సంస్థాగతంగా పార్టీ విస్తరించేందుకు ప్రయత్నాలు చేయాలని చూస్తున్నామని వివరించారు. జాతీయస్థాయిలో అధ్యక్ష మార్పులుంటాయని చెప్పారు. ఏపీలో మార్పులు ఉంటాయా లేదా అన్నది తాను చెప్పలేనని అన్నారు. రాష్ట్రంలో పరిస్థితులను వివరించి, ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించానని అన్నారు. అలాగే గత ప్రభుత్వం ఐదేళ్లుగా రాష్ట్రంలో ఆరోగ్య విభాగాన్ని భ్రష్టుపట్టించిన విధానాన్ని కూడా వివరించానని చెప్పారు. 11 టీచింగ్ మెడికల్ కాలేజీలు ఉంటే, 6 కాలేజీల్లో మాత్రమే కేటలాగ్స్ ఉన్నాయన్నారు. మిగతా 5 కాలేజీలకు కేటలాగ్స్ మంజూరు చేయాలని కోరానని అన్నారు. కేన్సర్‌కి సంబంధించి మరికొన్ని కేంద్రాలు మంజూరు చేయాలని కోరానని తెలిపారు. ఔంఉఃఓ నుంచి నిధులు మంజూరు చేసే ప్రొవిజన్ లేదన్నారు. అయితే రూ. 300 కోట్లు మంజూరు చేయాలని కోరానని అన్నారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను పాత జిల్లాల లెక్కన మంజూరు చేశారని తెలిపారు. కొత్తగా జిల్లాలు ఏర్పడ్డ నేపథ్యంలో ఆ ప్రకారం మంజూరు చేయాలి. గ్రామీణ ఆరోగ్య మందిర్ల నిర్మాణానికి సహకారం అందించాలి. ఆరోగ్య మందిర్లలో సిబ్బందికి జీతాలు చెల్లించడం కోసం రూ. 1,000 కోట్లు అందించాలి. అరాచక పాలన కారణంగా ఏపీ అన్ని రకాలుగా వెనుకబడింది. రాష్ట్రంలో గత 45 రోజులుగా అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి కేంద్ర మంత్రికి వివరించా. ఉచిత ఇసుక, సామాజిక భద్రత స్కీమ్స్ తదితర పథకాల గురించి చెప్పాను. సీఎం చంద్రబాబు ఢిల్లీ వచ్చిన ప్రతిసారీ రాష్ట్రానికి ఏదో ఒకటి సాధించుకుని వెళ్తున్నారు. అమరావతి రింగ్ రోడ్డు ప్రాజెక్టు సామాన్య విషయం కాదు. భారత్ పెట్రో రిఫైనరీ, విశాఖ మెట్రో రైల్ ఇలా చాలా విభజన హామీలను సాధించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వం అమరావతిని స్మశానం చేయడం కోసం పనిచేసింది. రింగ్ రోడ్ వచ్చి ఉంటే ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారిపోయేవి. విశాఖపట్నం మెట్రో విషయంలో డీపీఆర్ రివైజ్ చేసి పంపించమంటే ఇంతవరకు గత ప్రభుత్వం ఇవ్వలేదు. విశాఖను పాలనా రాజధాని అన్నారు తప్ప చిత్తశుద్ధి ప్రదర్శించలేదు. స్టాండర్డ్ ప్రొటోకాల్ ప్రకారం సీజనల్ వ్యాధుల గురించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏప్రిల్ నెల నుంచే ఈ ఏర్పాట్లు చేయాలి. మేం అధికారంలోకి వచ్చింది జూన్ నెలలో. వారు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదు. మేము అధికారంలోకి వచ్చాక ఉదాసీనత లేకుండా పనిచేస్తున్నాం. జగ్గయ్యపేటలో ఐదేళ్లుగా క్లోరినేషన్ జరగలేదు. ఫిల్టర్లు మార్చలేదు. ఓవర్‌హెడ్ ట్యాంకుకు నిచ్చెన లేకపోవడం వల్ల క్లోరినేషన్ జరగడం లేదు. నిర్వహణ లేకపోవడం వల్ల ఎంత ఇబ్బంది తలెత్తుతుందో ఇదే ఉదాహరణ. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ జింక్ ట్యా÷-లబెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సంక్షేమం అసాధ్యం. అయినా సరే సంక్షేమం, అభివృద్ధి - రెండూ చేస్తున్నాం. నాలుగేళ్లుగా సుగాలి ప్రీతి కేసులో ఏమీ చేయకుండా, ఇప్పుడొచ్చి మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. రాజకీయాల్లో విమర్శలు అవసరమే. నిర్మాణాత్మకంగా అవి ఉండాలి. గతంలో విమర్శలు చేస్తే ఎలా కేసులు పెట్టారు? ఎలా వేధించారు? మీ పనుల కారణంగా ప్రజలు ఇలాంటి తీర్పునిచ్చారు. సుగాలి ప్రీతి కేసుకు సమాధానం చెబుతాం. అలాగే గొడ్డలి పోటుకు కూడా సమాధానం చెబుతాం అని మంత్రి సత్యకుమార్ తెలిపారు. పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై ముందు జాగ్రత్తల విషయంలో గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. జాగ్రత్తలు తీసుకోక పోవడం వల్ల మా ప్రభుత్వం ఒక కమిటీ వేయాల్సి వచ్చింది. మీరు దోచుకున్న భూములకు చట్టబద్ధత కల్పించుకోవడం కోసం ఒక చట్టాన్ని తెచ్చి, కేంద్ర ప్రభుత్వంసూచించింది. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతలు పారిపోకుండా నిర్మాణాత్మక చర్చ జరిగేలా సహకరించాలి. ఆరోగ్యశాఖను అనారోగ్య శాఖగా వ్యవహరించేలా ఐదేళ్లలో విధ్వంసం జరిగింది. అధ్యయనం చేయకుండా అడ్డగోలుగా మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారు. వాటికి నిధులు ఇవ్వలేదు. చాలావాటికి కేంద్రం వివిధ స్కీముల ద్వారా, నాబార్డ్ ద్వారా నిధులు అందజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందించాల్సింది ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఔఓఅ నిబంధనలను పరిగణలోకి తీసుకోకుండా పునాదులు వేసి వదిలేశారు. సీఎం సొంత నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ నిర్మాణం మాత్రమే పూర్తయింది.

## కర్నాటకలో ఇక లోకల్స్‌కు ఉద్యోగాల్లో ప్రాధాన్యం

బెంగళూరు,జూలై 17 : ప్రైవేట్ రంగంలో స్థానికులకే ఉద్యోగాలు తప్పనిసరి చేస్తూ కర్నాటక ప్రభుత్వం కొత్త బిల్లు ఆమోదించింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి ఎక్స్ లో దీనికి సంబంధించి ఓ పోస్ట్ పెట్టారు. దాని ప్రకారం ప్రైవేట్ పరిశ్రమల్లోని గ్రూప్ సి,డి గ్రేడ్ ఉద్యోగాలు నూటికి నూరు శాతం కన్నడిగులనే నియమించాలని మంత్రి వర్గం సోమవారం బిల్లును ఆమోదించిందని పేర్కొంది. ఇదే పద్ధతి ల అయితే సిద్దరామయ్య పోస్ట్ పై అనేక విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో ఆయన తర్వాత దానిని తొలగించారు. ఆ తర్వాత మరో సవరణ ట్వీట్ చేశారు. కన్నడిగులకు కోటా గురించి పేర్కొన్నారు. కర్నాటక బిల్లు వల్ల కర్నాటకలో ఐటి సంస్థలతో సహా వివిధ పరిశ్రమలు, కర్మాగారాల్లో ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగాలు తగ్గిపోనున్నాయని తెలుస్తోంది. కర్నాటకలో జన్మించి 15 ఏళ్లుగా నివసిస్తున్న వారిని, కన్నడ భాష మాట్లాడటం, చదవడం, రాయడం తెలిసిన వారినే స్థానికులుగా గుర్తించనున్నారు. అంతేగాక రాష్ట్ర నోడల్ ఏజెన్సీ నిర్వహించే అర్హత పరీక్షల్లో నెగ్గిన వారిని స్థానిక అభ్యర్థులుగా పరిగణిస్తారు.

## ఆల్మట్టి గేట్లు ఎత్తివేత

**కేరళను వదలని వర్షాలు**

బెంగళూరు,జూలై 17 : కృష్ణానది పరివాహకగా ఎగువన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో కృష్ణానదికి వరద ఉధృతి పెరగడంతో ఆల్మట్టి డ్యామ్ నిండుకుండలా తలపిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 129టిఎంసీలు కాగా.. ఇప్పటికే 100 టీఎంసీలకు చేరుకుంది. రాగల నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించడంతో అధికారులు ఆల్మట్టి డ్యామ్ గేట్లు ఎత్తారు. దీంతో కృష్ణమ్మ తెలుగు రాష్ట్రాల వైపు పరుగులు పెడుతోంది. దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయంలోకి భారీగా వరద చేరుకుంటోంది. నారాయణపూర్ ప్రాజెక్టులో కూడా 37టీఎంసీల పూర్తి స్థాయి నిలువ సామర్థానికిగాను 28టిఎంసీల నీరు నిలువ ఉంది.దీంతో ఈరోజుతో నారాయణపూర్ డ్యామ్ గరిష్ఠ స్థాయికి చేరుకోనుంది. దీంతో డ్యామ్ గేట్లు ఎత్తి దిగువన జూరాలకు నీటిని విడుదల చేయనున్నారు. మరో రెండు రోజుల్లో జూరాల కూడా నిండనుంది. ఆ తర్వాత శ్రీశైలం డ్యామ్‌కు నీటిని వదలనున్నారు. మరోవైపు కేరళలో భారీ వర్షాలు కురుస్తుండటంతో భారత వాతావరణ శాఖ బుధవారం రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటం, ఆస్తి నష్టం, రోడ్లపై నీరు నిలిచిపోవడం, అనేక ఎకరాల్లో వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి. కేంద్ర జల సంఘం (అచిఅ) దక్షిణాది రాష్ట్రంలోని వివిధ నదుల మట్టాలు ప్రమాదకరమైన స్థాయికి చేరాయని హెచ్చరిక జారీ చేసింది. కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, మలప్పురం, కోజికోడ్, వాయనాడ్, కన్నూర్ , కాసర్‌గోడ్ జిల్లాల్లో ఐఎండి ఆరెంజ్ అలర్ట్‌లు ప్రకటించింది. రాష్ట్రంలోని మిగిలిన ఆరు జిల్లాల్లో కూడా ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

## 31లోగా రిటర్న్స్ ఫైల్ చేయాల్సిందే

హైదరాబాద్,జూలై 17 : ఆర్థిక సంవత్సరం 2023-24కు సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్స్ వేయాల్సిన తేదీ జులై 31. సకాలంలో ÷ల్గ÷లింగ్ చేయకపోతే జరిమానాలు పడతాయి. ఎంత ఆలస్యం ఫైల్ చేశారనే దానిపై ఆధారపడి ఆ జరిమానా ఉంటుంది. ఒకవేళ మీరు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన వారు కానట్లయితే? మీకు టిడిఎస్ వంటి పన్ను రీఫండ్ జరగాలంటే ఐటీఆర్ ను సకాలంలో ÷ల్ చేయండి. సకాలంలో ÷ల్ చేయలేని వారు ఆలస్య రుసుముతో పన్ను రిటర్నును దాఖలు చేయవచ్చు. ఆలస్యంగా ఫైల్ చేసే వారికి చివరి తేదీ 31 డిసెంబర్ 2024. డిఫాల్ట్ అయ్యే వారకి రూ. 5000 పెనాల్టీ పడుతుంది. అయితే ఆదాయం రూ. 5000కు మించకపోతే రూ. 1000 గా ఉంటుంది. ఆలస్యం అయ్యే కొద్దీ పెనాల్టీ వడ్డీ పెరుగుతుంది కనుక సకాలంలో ÷ల్ చేయడం మంచిది. అలా చేస్తే నోటీసులు, స్క్రూటినీ ప్రొసీడింగ్స్ నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది.

## ధోవతి ధరించిన వ్యక్తికి మాల్‌లో అవమానం

**లోనికి అనుమతించని సెక్యూరిటీ సిబ్బంద**

**మండిపడుతున్న నెటిజన్లు**

బెంగళూరు,జూలై 17 : ధోవతి ధరించి వచ్చిన వృద్ధుడిని ఓ మాల్‌లో లోనికి రానివ్వలేదు. ప్యాంట్ వేసుకొని వస్తేనే అనుమతిస్తామని సెక్యూరిటీ సిబ్బంది ఆయనతో నిక్కచ్చిగా చెప్పడంతో అతను విస్తు పోయాడు. ఈ ఘటన బెంగళూరులోని జిటి మాల్‌లో చోటు చేసుకుంది. వృద్ధుడితో పాటు అతని కొడుకు కూడా మాల్‌కి వచ్చాడు. కొడుకు ఎంత అభ్యర్థించినా భద్రతా సిబ్బంది వినలేదు. తన తండ్రిని లోనికి అనుమతించాలని ఆ కొడుకు విజ్ఞప్తి చేస్తున్న వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. సదరు మాల్‌పై నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. సినిమా కోసం వారు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. దీంతో వారు మాల్ ప్రవేశద్వారం ద్వారా లోనికి వెళుతుండగా భద్రతా సిబ్బంది ఆ తండ్రీకొడుకులను నిలిపివేశారు. మాల్ నిబంధనల ప్రకారం ధోవతి ధరించిన వారికి లోనికి అనుమతి లేదని సెక్యూరిటీ సిబ్బంది వారితో వాదించారు. తన తండ్రి దూర ప్రాంతం నుంచి వచ్చారని, అప్పటికప్పుడు దుస్తులు మార్చుకునే సమయం దొరకలేదని, అందుకే వచ్చామని చెప్పినప్పటికీ సిబ్బంది వినలేదు. కచ్చితంగా ప్యాంట్ మార్చుకొని రావల్సిందేనని సూచించారట. ఈ వీడియోపై నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. వృద్ధుడికి ఇచ్చే గౌరవం ఇదా? అని కామెంట్ చేస్తున్నారు. ఈ అంశంపై బిజెపి జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ధోవతి ధరించినందుకు రైతులను తిట్టడం, అవమానించడం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి ధోవతి ధరిస్తారు కానీ? మాల్‌లోకి రైతును ధోవతితో అనుమతించరా అన్నారు.

## నిజామాబాద్‌లో బ్యాంక్ మేనేజర్ మోసం

**ఖాతాదారుల పేరుతో రుణాలు తీసి డ్రా**

**5కోట్ల వరకు మోసం చేసి పరార్**

నిజామాబాద్,జూలై 17 : నిజామాబాద్ జిల్లా కేంద్రంగా భారీ స్కాం వెలుగులోకి వచ్చింది. ఖాతాదారుల డబ్బులను లాగేసుకున్న ఓ బ్యాంక్ మేనేజర్ ఉడాయించాడు. దాదాపు ఐదుకోట్ల వరకు ఖాతాల్లో ఉన్న నగదును లాగేసుకున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్‌లోని యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని తెలిసింది. ప్రైవేటు వ్యక్తుల పేరిట రూ.కోట్లల్లో స్కాం చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు గుర్తించిన లెక్కల ప్రకారం 42 మంది ఖాతాల్లో రూ.5 కోట్ల కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. శివాజీ నగర్ బ్యాంకులో పని చేస్తున్న బ్యాంక్ మేనేజర్ అజయ్ ..ముద్ర, బిజినెస్, పర్సనల్, విద్యా, ఓ.డి. రుణాల పేరుతో ఖాతాదారుల పేర్లతో రుణాలు తీసుకున్నాడు.అయితే వాటిని లబ్దిదారుల ఖాతాకు కాకుండా నేరుగా తన ఖాతాలకు మళ్లించాడు. ఆ తర్వాత పలువురికి ఈఎంఐ చెల్లించాలని బ్యాంకు నుంచి వారి ఫోన్లకు సందేశాలు వెళ్లాయి. దీంతో పాటు మరి కొందరు డిఫాల్టర్ అయ్యారు. బాధితులు బ్యాంకుకు వెళ్లి ఆరాతీయగా స్కాం జరిగిన విషయం బయటకు వచ్చింది. ఈ ఘటనపై అప్రమత్తమైన యూనియన్ బ్యాంక్ అధికారులు అంతర్గత విచారణ చేపట్టారు. బాధితులను పిలిపించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం స్కాంకు పాల్పడిన సదరు అధికారి అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. అయితే బ్యాంకు అధికారులు ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. అజయ్ గుంటూరు జిల్లా తెనాలికి చెందిన వాడుగా గుర్తించారు. అతని కోసం గాలిస్తున్నారు.

## నటుడు నారాయణమూర్తికి అస్వస్థత

**నిమ్స్‌కు తరలించి చికిత్స**

హైదరాబాద్,జూలై 17 : దర్శక నటుడు, నిర్మాత ఆర్ నారాయణ మూర్తి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన్ను హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. డాక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో ఆర్ నారాయణమూర్తికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయగా.. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్లు స్పష్టం చేశారు. బుధవారం ఉదయం ప్రసాద్ ల్యాబ్స్ లో ఆర్ నారాయణమూర్తి ఓ ప్రెస్ మీట్ కు హాజరయ్యారు. ఆ ప్రెస్ మీట్‌లో నారాయణమూర్తి ఏమీ మాట్లాడలేకపోయారు. తనకు చాలా నీరసంగా ఉందని.. కళ్లు తిరుగు తున్నాయని నారాయణమూర్తి చెప్పారు. దీంతో ఆయన పక్కనే ఉన్నవారు నారాయణమూర్తిని వెంటనే నిమ్స్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. నారాయణమూర్తికి 2 నెలల క్రితమే గుండెకు బైపాస్ సర్జరీ జరిగింది. గుండె నాళాల్లో బ్లాకులు ఉండటంతో బైపాస్ సర్జరీ చేశారు. అప్పటి నుంచి గతంతో పోల్చితే కాస్త మెత్తగానే ఉంటున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 18 జూలై 2024





# సెలక్షన్ కమిటీ సమావేశం వాయిదా

టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన భారత్ మరో పర్యటనకు సిద్ధమైంది. పది రోజుల్లో శ్రీలంక పర్యటన ప్రారంభం కానుంది. లంకతో టీమిండియా మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. మెగాటోర్నీలో గెలిచిన అనంతరం భారత్‌కు ఇది రెండో పర్యటన అయినప్పటికీ.. సీనియర్లు బరిలోకి దిగుతున్న మొదటి సిరీస్ ఇదే. జింబాబ్వే పర్యటనకు శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యువ జట్టు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే శ్రీలంక సిరీస్ టీమిండియాకు ఎంతో కీలకం కానుంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ లక్ష్యంగా రోడ్ మ్యాప్‌ను లంక సిరీస్‌తోనే ప్రారంభించనుంది. అంతేగాక నయా కోచ్ గౌతమ్ గంభీర్ ఈ పర్యటనతోనే కోచ్ బాధ్యతలు చేపట్టనుండటంబీ స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా పొట్టిఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో.. లంక పర్యటనకు భారత జట్టు ఎంపికపై అందరిలో ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో గత రెండు రోజుల నుంచి భారత జట్టు ప్రకటన గురించి వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇవాళ కచ్చితంగా బీసీసీఐ జట్టును ప్రకటిస్తుందని జోరుగా ప్రచారం సాగింది. అయితే బుధవారం భారత జట్టును ప్రకటించట్లేదని తాజా సమాచారం. సెలక్షన్ కమిటీ సమావేశం వాయిదా పడింది.కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మతో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ బుధవారం మీటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. కానీ దాన్ని గురువారానికి వాయిదా వేశారు.శ్రీలంక పర్యటనకు టీమిండియా జులై 22వ తేదీన బయలుదేరాల్సి ఉంది. దీంతో భారత జట్టును త్వరగానే ప్రకటించాలని బీసీసీఐ తొలుత భావించింది. కానీ లంక వన్డే సిరీస్‌కు సీనియర్లు ఉండాలని నయా కోచ్ గంభీర్ కోరడంతో ఎంపిక వాయిదా పడుతుందని తెలుస్తోంది. వన్డేలకు రోహిత్ అందుబాటులో ఉండేలా బీసీసీఐ కోరడంతో, ఈ విషయం గురించి టీమిండియా కెప్టెన్ కాస్త సమయాన్ని కోరినట్లుగా తెలుస్తోంది. దీంతో రోహిత్ నుంచి స్పష్టత వచ్చే వరకు వాయిదా వేస్తున్నారని సమాచారం. మరోవైపు కోహ్లి, బుమ్రా లంక పర్యటనకు విశ్రాంతి కోరినట్లు తెలుస్తోంది.

# 37వ స్థానంలో నిలిచిన శుభ్‌మన్ గిల్

జింబాబ్వే పర్యటనను ఘనంగా ముగించిన భారత యువ ఆటగాళ్లు ఐసీసీ టీ20ల్లో ర్యాంకింగ్స్‌లో సత్తాచాటారు. అయిదు టీ20ల సిరీస్‌ను జింబాబ్వేపై 4-1తో టీమిండియా విజయం సాధించిన విషయం తెలిసిందే. తొలి టీ20లో ఓటమిపాలైనా, తర్వాత గొప్పగా పుంజుకుని విజయాలతో హోరెత్తించింది. భారత క్రికెట్ భవిష్యత్‌కు భరోసా ఇస్తూ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యువ జట్టు ఆకట్టుకుంది. అయితే ఈ సిరీస్‌లో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచిన శుభ్‌మన్ గిల్ ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లాడు. అతనితో పాటు యశస్వీ జైస్వాల్ తన ర్యాంక్‌ను మెరుగుపర్చుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గెలిచిన వాషింగ్టన్ సుందర్, బంతితో అలరించిన ముకేశ్ కుమార్ కూడా ర్యాంకింగ్స్ ముందుకు వెళ్లారు. జింబాబ్వే సిరీస్‌లో42 సగటు, 125 స్ట్రైక్‌రేటుతో 170 పరుగులు చేసిన గిల్ ఏకంగా 36 స్థానాలు ఎగబాకి 37వ స్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ (42 ర్యాంక్), విరాట్ కోహ్లి (51) ర్యాంక్‌లను గిల్ అధిగమించాడు. టీ20 వరల్డ్ కప్ ముగిసిన అనంతరం రోహిత్, కోహ్లి టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు జైస్వాల్ నాలుగు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఈ సిరీస్‌లో జైస్వాల్ సెకండ్ లీడింగ్ రన్ స్కోరర్. 141 పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ ఓ స్థానాన్ని కోల్పోయి ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నాడు. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్-10లో భారత్ నుంచి సూర్య, జైస్వాల్, రుతురాజ్ ఉన్నారు. సూర్యకుమార్ యాదవ్ 797 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అగ్రస్థానంలో ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ (844 పాయింట్లు) ఉన్నాడు. ఆరు వికెట్లతో సిరీస్‌లో రాణించిన సుందర్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 36 స్థానాలు మెరుగుపర్చుకుని 46 స్థానంలో నిలిచాడు. ముకేశ్ కుమార్ 21 స్థానాలు ఎగబాకి 73 ర్యాంక్‌కు చేరుకున్నాడు. కాగా, జింబాబ్వే సిరీస్‌కు దూరమైన అక్షర్ పటేల్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు కోల్పోయి 13వ ర్యాంక్‌లో నిలిచాడు. ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ టాప్‌లో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్య ఆరో ర్యాంక్‌కు పడిపోయాడు. జింబాబ్వే పర్యటనకు దూరమైన హార్దిక్ కూడా నాలుగు స్థానాలు కోల్పోయాడు. టాప్‌లో హసరంగ ఉన్నాడు. జింబాబ్వే కెప్టెన్ ఓ స్థానాన్ని మెరుగుపర్చుకుని మూడో ర్యాంక్‌కు చేరుకున్నాడు.

# క్రికెట్ హిస్టరీలో అన్‌లక్కీ ఔట్!!

క్రికెట్‌లో మనం ఎన్నో ఔట్‌లు చూశాం. బౌలర్ల ప్రతిభతో, బ్యాటర్ల పేలవ ప్రదర్శనతో వికెట్లు పడటం చూస్తుంటాం. కానీ సెకండ్ లెవన్ టీ20 ఫైనల్స్‌లో ఓ బ్యాటర్ విచిత్రంగా ఔటయ్యాడు.్దురదృష్టం వెంటాడితే ఔటయ్యే ప్రమాదాన్ని తప్పించుకోలేమనే రీతిలో పెవిలియన్‌కు చేరాడు. మంగళవారం యార్క్‌షైర్ సెకండ్ లెవన్‌తో జరిగిన మ్యాచ్‌లో సోమర్సెట్ సెకండ్ లెవన్ 66 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన సోమర్సెట్ నిర్ణీత 20 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ థామస్ అర్ధశతకం సాధించాడు. 27 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 52 పరుగులు చేశాడు. యార్క్‌షైర్ బౌలర్లలో హిల్ నాలుగు, క్లిఫ్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో యార్క్‌షైర్ 16.5 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. వగాడియా (27బీ 15 బంతుల్లో, 5 ఫోర్లు) టాప్ స్కోరర్. లియోనార్డ్ నాలుగు వికెట్లతో చెలరేగాడు. అయితే సోమర్సెట్, ఇన్నింగ్స్‌లో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. రెండు బంతులు ఎదుర్కొని వికెట్ చేజార్చుకున్న లియోనార్డ్ భిన్నమైన రీతిలో పెవిలియన్‌కు చేరాడు. క్లిఫ్ వేసిన బంతిని లియోనార్డ్ షాట్‌కు యత్నించాడు. అయితే బాల్ నాన్‌స్ట్రైకర్ మీదుకు దూసుకెళ్లింది. తప్పించుకోవడానికి అతను ప్రయత్నించినప్పటికీ బంతి బలంగా తాకి బౌలర్ దిశగా గాల్లోకి లేచింది. ఆ తర్వాత దాన్ని క్లిఫ్ సునాయాసంగా క్యాచ్ అందుకున్నాడు. దీంతో లియోనార్డ్ నిరాశగా మైదానాన్ని వీడాడు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. క్రికెట్ చరిత్రలో అన్‌లక్కీ వికెట్ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## శ్రీలంక మాజీ క్రికెటర్ దారుణ హత్య!

శ్రీలంక మాజీ క్రికెటర్ ధామిక నిరోషన(41) దారుణ హత్యకు గురయ్యాడు. భార్య, పిల్లల ఎదుటే ఓ దుండగుడు అతన్ని దారుణంగా కాల్చి చంపాడు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. శ్రీలంకలోని గాలె జిల్లాలోని అంబాలన్‌గోడా ప్రాంతంలో ధామిక కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఓ వ్యక్తి అతడి ఇంట్లోకి చొరబడి ధామిక నిరోషనపై దాడి చేశాడు. అతడి కుటుంబ సభ్యుల ముందే తుపాకీతో కాల్పులు జరిపాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ధామిక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. కాల్పులకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు మీడియాకు వెల్లడించారు. రైట్ హ్యాండ్ ఫాస్ట్ బౌలర్ అయిన ధామిక 2000 సంవత్సరంలో శ్రీలంక అండర్ 19 జట్టుకు సారథిగా వ్యవహరించాడు. రెండేళ్ల పాటు వన్డేలు, టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. ఆ తర్వాత కొంతకాలం ఫస్ట్ క్లాస్, లిస్ట్ ఏ మ్యాచ్‌లకు ప్రాతినిథ్యం వహించిన ధామిక.. వ్యక్తిగత కారణాలతో 20 ఏళ్ల వయసులోనే క్రికెట్‌ను వదిలేశాడు. అతని అకాల మరణం పట్ల శ్రీలంక క్రికెటర్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు

# చివరి 5 ఓవర్లలో భారత బౌలర్లు, ఫీల్డర్లు అద్భుతమైన ప్రదర్శన చేశారు

## రోహిత్ శర్మ సంచలన కామెంట్స్

2007లో ధోని సారథ్యంలో టీమిండియా టి20 వరల్డ్ కప్ గెలిచింది. ఆ తర్వాత 2014లో ఫైనల్ వెళ్లినప్పటికీ శ్రీలంక చేతిలో ఓడిపోయింది. మళ్లీ 10 సంవత్సరాల తర్వాత ఫైనల్ వెళ్ళింది. వెస్టిండీస్ లోని బార్బడోస్ వేదికగా ఫైనల్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికాతో తలపడింది. ఈ మ్యాచ్ లో టీమిండియా 176 రన్స్ చేసింది. 177 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 169 పరుగుల వద్ద ఆగిపోయింది. క్లాసెన్ 27 బంతుల్లో 52 పరుగులు చేసి, మెరుపు ఇన్నింగ్స్ ఆడినప్పటికీ.. ఉపయోగం లేకుండా పోయింది. ఓ ఎండ్ లో క్లాసెన్, మరో ఎండ్ లో డేవిడ్ మిల్లర్ ఉండడంతో దక్షిణాఫ్రికా విజయ సమీకరణం 30 బంతులకు 30 పరుగులుగా మారింది. అప్పటికి దక్షిణాఫ్రికా జట్టు చేతిలో ఆరు వికెట్లు చేతిలో ఉన్నాయి. మైదానం లోపల ఉన్న ఆటగాళ్లకు.. మ్యాచ్ చూస్తున్న అభిమానులకు భారత జట్టు విజయంపై ఏమాత్రం ఆశలు లేవు. ఈ స్థితిలో చివరి 5 ఓవర్లలో భారత బౌలర్లు, ఫీల్డర్లు అద్భుతమైన ప్రదర్శన చేశారు. ఫలితంగా భారత జట్టు అద్భుతమైన విజయం సాధించింది. కీలక సమయాలలో భారత్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన వ్యూహాలను అమలు చేసి దక్షిణాఫ్రికా జట్టుపై ఒత్తిడి పెంచాడు. వాస్తవానికి 15 ఓవర్ అక్షర్ పటేల్ వేశాడు. ఆ ఓవర్లో క్లాసెన్ చెలరేగిపోయాడు. ఆ సమయంలో ఏం చేయాలో రోహిత్ శర్మకు అర్థం కాలేదు..” ఒక్కసారిగా నా మైండ్ బ్లాంక్ అయిపోయింది. అటువంటి క్లిష్ట సమయంలో నేను మరో విధంగా ఆలోచించలేదు. అప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా స్పందించడం కీలకమనుకున్నాను. ప్రశాంతంగా మా ప్లాన్స్ అమలు చేయాలని భావించాను. దక్షిణాఫ్రికా విజయ్ సమీకరణం 30 బంతులకు 30 పరుగులుగా ఉన్నప్పుడు తీవ్రమైన ఒత్తిడికి గురైన మాట వాస్తవం. కానీ మా బౌలర్లు ఆ తర్వాతే 5 ఓవర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. దాన్నిబట్టి మేము ఎంత ప్రశాంతంగా ఉన్నామో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా పరాజయం చవిచూస్తామని సంకేతాలు కనిపించినప్పుడు నిరాశలో కూరుకుపోవడం సర్వసాధారణం. కాకపోతే మేము అలా నిరాశను దరి చేరనివ్వలేదు. సానుకూల దృక్పథాలను ప్రోది చేసుకోవడం ద్వారా మాది అద్భుతమైన జట్టని నిరూపించామని” రోహిత్ పేర్కొన్నాడు. దాదాపు 17 సంవత్సరాల తర్వాత టి20 వరల్డ్ కప్ గెలుచుకోవడంతో టీమ్ ఇండియా అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. ముఖ్యంగా మ్యాచ్ గెలిచిన తర్వాత రోహిత్ ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యాడు. మైదానం పై అలానే పడుకుని ఉన్నాడు. నాలుగైదు సార్లు గట్టిగా నాక్స్ ఇచ్చాడు. హార్దిక్ పాండ్యా, విరాట్ కోహ్లీ వంటి ఆటగాళ్లను గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు. ఆ తర్వాత మైదానంపై జాతీయ జెండాను పాతాడు. ఔట్ ఫీల్డ్ పై పెరిగిన గడ్డిని తిన్నాడు. ఆ మట్టిని కూడా నోట్లో వేసుకున్నాడు.. అనంతరం ఈ మైదానం తనకు ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నాడు. ఫైనల్ మ్యాచ్లో హార్దిక్ పాండ్యా చివరి ఓవర్ లో అద్భుతాలు చేశాడు. ప్రమాదకరమైన మిల్లర్, జాన్సన్ ను ఔట్ చేశాడు.

మరీ ముఖ్యంగా మిల్లర్ కు ఫుల్ టాస్ బంతి వేయగా అతడు బలంగా కొట్టాడు.. బౌండరీ లైన్ వద్ద ఉన్న సూర్య కుమార్ యాదవ్ అద్భుతమైన రిలే క్యాచ్ పట్టి డేవిడ్ మిల్లర్ ను పెవిలియన్ పంపించాడు. చివరి ఓవర్లో పాండ్యా రెండు వికెట్లు పడగొట్టి, 8 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఫలితంగా టీమిండియా ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది.



# విరాట్ కోహ్లీ మమ్మల్నే స్లెడ్జ్ చేసేవాడు

## ఆసీస్ మాజీ కెప్టెన్ టిమ్ పైన్ వెల్లడి

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని గత మూడు సీజన్లలో టీమిండియానే కైవసం చేసుకుంది. 2018-19 సీజన్‌లో విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో ఆస్ట్రేలియా పర్యటనకి వెళ్లిన భారత జట్టు, ఆసీస్ టీమ్‌కి చుక్కలు చూపించింది. ఆడిలైడ్ టెస్టులో 31 పరుగుల తేడాతో గెలిచిన భారత జట్టు, ఆ తర్వాత పెర్త్ టెస్టులో 146 పరుగుల తేడాతో ఓడింది. మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్టులో 137 పరుగుల తేడాతో నెగ్గిన భారత జట్టు, సిడ్నీలో జరిగిన నాలుగో టెస్టును డ్రా చేసుకుంది. సిడ్నీలో ఆఖరి టెస్టులో ఆస్ట్రేలియాతో ఫాలో ఆన్ ఆడించి, పూర్తి ఆధిపత్యం చూపించింది కూడా.. బాల్ ట్యాంపరింగ్ కేసులో ఇరుక్కుని స్టీవ్ స్మిత్, టెస్టు కెప్టెన్సీ కోల్పోయాడు. దీంతో ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్‌గా వ్యవహరించిన టిమ్ పైన్, విరాట్ కోహ్లీ గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్లు చేశాడు.

‘చాలామంది నాతో, విరాట్ కోహ్లీని స్లెడ్జ్ చేయొద్దని చెప్పేవాళ్లు. ఎందుకంటే అతనికి కోపం వస్తే, ఇంకా ఎక్కువగా పరుగులు చేస్తాడని... అయితే స్లెడ్జ్ చేసినా, చేయకపోయినా అతని బ్యాటింగ్ మారదు, విరాట్ క్రీజులోకి వస్తే ఫెయిల్ అయ్యే అవకాశాలు చాలా తక్కువ.. విరాట్ కోహ్లీకి కోపం తెప్పించాలని నేను ప్రయత్నించలేదు. అయితే అతని ఏకాగ్రతకు భంగం కలిగించేలా ఏదో ఒకటి మాట్లాడాలని చూసేవాడిని.. అతను ఓ బ్యాడ్ షాట్ ఆడితే వికెట్ దక్కుతుందని ప్రయత్నించేవాడిని... అయితే మా టీమ్ మేట్స్ కూడా అలా చేయొద్దని చెప్పేవాళ్లు.. నాకు అవమానంగా ఉండేది... నేను డగౌట్‌లో కూర్చొని, విరాట్ కోహ్లీని గమనిస్తూ ఉండేవాడిని.. మా ప్లేయర్లకు సెండాఫ్స్ ఇచ్చి, పంపించేవాడు.. అతను బ్యాటింగ్ చేసేటప్పుడు స్లెడ్జ్ చేయొద్దని మా కోచ్ చెప్పాడు. అదే మా ప్లాన్.. అతన్ని డిస్టబ్ చేయడానికి ప్రయత్నించకపోతే ఎక్కడ డిస్టబ్ అవుతాడు.. అలాగే మేం బ్యాటింగ్ చేస్తున్నప్పుడు వాళ్లు కూడా సైలెంట్‌గా ఉంటారని అనుకున్నాం.. అయితే విరాట్ కోహ్లీ అలా కాదు. అతని కెప్టెన్సీ స్టైల్ పక్కా ఆస్ట్రేలియన్‌లా ఉంటుంది. మా బ్యాటర్లను స్లెడ్జ్ చేసేశాడు. పార్ట్ టైమ్ కెప్టెన్ అని నన్ను ట్రోల్ చేసి, నా ఏకాగ్రత దెబ్బ తీసే ప్రయత్నం చేశాడు. నేను మాత్రం నువ్వు చాలా గొప్ప బ్యాటర్, గ్రేటెస్ట్ ప్లేయర్ అంటూ పొగిడే వాడిని.. ఎందుకంటే విరాట్ కోహ్లీకి గొడవ కావాలి. అతను ఏదైనా అంటే మనం దానికి గట్టిగా రిప్లై ఇవ్వాలని ఆశిస్తాడు. అలాంటి అవకాశం ఇవ్వకుండా చూసుకునేవాడిని... నా ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యింది కూడా..’ అంటూ కామెంట్ చేశాడు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ టిమ్ పైన్..



### 61 పరుగుల లక్ష్యాన్ని 11 బంతుల్లోనే

# ఛేదించి ఉత్కంఠ విజయం

క్రికెట్ మైదానంలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట అద్భుతం జరుగుతూనే ఉంటాయి. ఒకవైపు బ్యాట్స్‌మెన్స్ తమ తుఫాన్ బ్యాటింగ్‌తో ఎన్నో రికార్డులు సృష్టిస్తుంటే.. మరోవైపు బౌలర్లు వం-్వసగా వికెట్లు తీస్తూ ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకుంటుంటారు. ఇప్పుడు అలాంటి ఘటనే జరగడంతో ఆస్ట్రియా జట్టు 61 పరుగుల లక్ష్యాన్ని కేవలం 11 బంతుల్లోనే ఛేదించి ఉత్కంఠ విజయం సాధించింది. చివరి దశ వరకు విజయం చేతిలోనే ఉన్న రొమేనియా జట్టు.. చివరి రెండు ఓవర్లలో బౌలర్ల పేలవమైన బౌలింగ్ కారణంగా ఓటమి మూల్యం చెల్లించుకుంది. నిజానికి యూరోపియన్ క్రికెట్‌లో ఆస్ట్రియా, రొమేనియా మధ్య మ్యాచ్ జరిగింది. ప్రస్తుతం జరుగుతున్న ఈసీఐ రొమేనియా టీ10 లీగ్ మ్యాచ్‌లో రొమేనియా దూకుడుగా బ్యాటింగ్ చేసి 167 పరుగులు చేసింది. రొమేనియా బ్యాట్స్‌మెన్ అరియన్ మహ్మద్ 39 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సర్లతో అజేయంగా 104 పరుగులు చేయగా, మహ్మద్ మోయిస్ 14 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 42 పరుగులు చేశాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు వచ్చిన ఆస్ట్రియా జట్టుకు ఈ ఛేజింగ్ దాదాపు అసాధ్యం. అప్పటికే ఆ జట్టు టాప్ మూడు వికెట్లు పడిపోయాయి. చివరి 2 ఓవర్లలో విజయానికి 61 పరుగులు చేయాల్సి ఉంది. ఆస్ట్రియా జట్టు ఎనిమిదో ఓవర్ వరకు 107 పరుగులు మాత్రమే చేయగలిగింది. కానీ, తొమ్మిదో ఓవర్లో ఆస్ట్రియా కెప్టెన్ అకిబ్ ఇక్బాల్ 41 పరుగులు చేశాడు. ఇందులో వైడ్ బాల్ బౌండరీ, నో బాల్‌లో రెండు సిక్సర్లు ఇలా పరుగుల వర్షం కురిసింది. ఆఖరి ఓవర్లో ఇమ్రాన్ ఆసిఫ్ సిక్సర్ కొట్టగా, అకిబ్ స్ట్రైక్ ఇచ్చాడు. ఆ తర్వాత అకిబ్ వరుసగా 3 సిక్సర్లు బాది జట్టుకు కేవలం 9.5 ఓవర్లలోనే అద్భుత విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో అకిబ్ 19 బంతుల్లో 2 ఫోర్లు, 10 సిక్సర్లతో అజేయంగా 72 పరుగులు చేశాడు. ఇమ్రాన్ ఆసిఫ్ కూడా 12 బంతుల్లో 1 బౌండరీ, 2 సిక్సర్లతో అజేయంగా 22 పరుగులు చేశాడు. దీంతో పాటు అద్భుత ప్రదర్శనతో ఆస్ట్రియా ఈసీఐ రొమేనియా టైటిల్‌ను కైవసం చేసుకుంది.





## మహానటే కావాలంటున్న హీరో ఫ్యాన్స్..!

డైరెక్టర్ హీరో కలిసి ఒక సూపర్ హిట్ కొడితే ఆ కాంబో రిపీట్ అయితే ఆడియన్స్ కి మరో బ్లాక్ బస్టర్ ఇవ్వడం పక్కా అని ఫిక్స్ అవుతారు. అలాంటి కాంబినేషన్స్ టాలీవుడ్ లో చలా జరిగాయి.. ఇప్పటికీ జరుగుతున్నాయి. ఈ క్రమంలో కొత్త దర్శకుడనే డౌట్ లేకుండా న్యాచురల్ స్టార్ నాని శ్రీకాంత్ ఓదెలకు దసరా ఛాన్స్ ఇచ్చాడు. ఆ సినిమా నానికి ఉన్న క్లాస్ ఇమేజ్ తీసి నానిలో కూడా ఊర మాస్ హీరో ఉన్నాడని ప్రూవ్ చేశాడు.

దసరా సినిమాలో నాని, కీర్తి సురేష్ పాత్రలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే ఆ సినిమా తర్వాత మళ్లీ ఈ డైరెక్టర్, హీరో కాంబో రిపీట్ అవుతుంది. నాని ప్రస్తుతం చేస్తున్న సరిపోదా శనివారం తర్వాత సుజిత్ తో ఒక సినిమా ప్లానింగ్ లో ఉంది. ఐతే ఆ సినిమా తర్వాత శ్రీకాంత్ ఓదెల సినిమానే ఉంటుందని టాక్. ఈ సినిమాను కూడా నాని ఇదివరకు సినిమాలకు భిన్నంగా చేయాలన్ అనుకుంటున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ గా జాన్వి కపూర్ ని తీసుకుంటున్నట్టుగా వార్తలు వస్తాయి. తెలుగు ఎంట్రీ ఇవ్వడమే తారక్ దేవర సినిమా చేస్తున్న జాన్వి కపూర్ చరణ్ బుచ్చి బాబు కాంబో మూవీలో కూడా అవకాశం దక్కించుకుంది. ఇక ఇప్పుడు నాని తో శ్రీకాంత్ ఓదెల చేయ-ఎబోతున్న సినిమాలో కూడా ఆమె నటిస్తుందని టాక్. ఐతే జాన్వి ఈ సినిమాలో కన్ఫర్మా కాదా అన్నది తెలియాల్సి ఉంది. ఐతే ఈ విషయం తెలిసిన నాని ఫ్యాన్స్ మాత్రం కీర్తి సురేష్ నే ఈ సినిమాలో హీరోయిన్ గా తీసుకోవాలని అంటున్నారు. దసరాలో వెన్నెల పాత్రలో కీర్తి సురేష్ అదరగొట్టేసింది. మళ్లీ అదే కాంబో సినిమా కాబట్టి హీరోయిన్ గా కీర్తి నే తీసుకుంటే బెటర్ అని అంటున్నారు. ఐతే సినిమా కథను బట్టి హీరోయిన్ క్యారెక్టరైజేషన్ ని బట్టి ఎవరిని తీసుకోవాలన్నది నిర్ణయిస్తారు. నాని శ్రీకాంత్ ఓదెల సినిమాలో కీర్తి సురేష్ అయితే బాగానే ఉంటుంది ఒకవేళ జాన్వి కపూర్ చేసినా నెక్ట్స్ లెవెల్ క్రేజ్ వస్తుందని అంటున్నారు. ఈ సినిమా గురించి మిగతా డీటైల్స్ త్వరలో బయటకు రానున్నాయి. దసరా తర్వాత తెలుగులో ఒక్క సినిమా చాన్స్ అందుకోని కీర్తి సురేష్ మళ్లీ దసరా కాంబో సినిమానే చేస్తుందా లేదా ఆ అవకాశాన్ని మిస్ చేసుకుంటుందా అన్నది వేచిచూడాలి.

## అనుపమ అక్కడ ఏం చేస్తున్నట్లు?

మల్లు బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ఈ ఏడాది టిల్లు స్క్వేర్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ ని తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాలో గ్లామర్ క్యారెక్టర్ తో రొమాంటిక్ సన్నివేశాలలో నటించి ఆకట్టుకుంది. హీరోయిన్ గా ఇప్పటి వరకుపెట్టుకున్న హద్దులని టిల్లు స్క్వేర్ సినిమాతో అనుపమ పరమేశ్వరన్ పక్కన పెట్టింది. ఈ సినిమాలో అనుపమ క్యారెక్టర్ ని మంచి గుర్తింపు లభించింది. రొమాంటిక్ లిప్ లాక్ సన్నివేశాలకి కూడా అనుపమ పరమేశ్వరన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో టాలీవుడ్ లో ఆమె ఇప్పుడు యంగ్ హీరోలకి ఛాయస్ గా మారే అవకాశం ఉందని అందరూ భావిస్తున్నారు. అయితే కథల ఎంపికలో మాత్రం అనుపమ పరమేశ్వరన్ చాలా పెర్ఫెక్ట్ గా ఉ ంటుంది. అవసరం లేకుండా కేవలం సాంగ్స్ కి, రొమాంటిక్ సన్నివేశాలకి మాత్రమే హీరోయిన్ గా తీసుకుంటామంటే అస్సలు యాక్సప్ట్ చేయదు. కథ నచ్చి, అందులో పాత్రకి మంచి ప్రాధాన్యత ఉ ంటేనే ఒప్పుకుంటుంది. అందుకే ఆమె కెరియర్ మిగిలిన హీరోయిన్స్ అంత స్పీడ్ కనిపించదు. ఇదిలా ఉంటే అనుపమ పరమేశ్వరన్ సినిమాలు లేని సమయంలో ఫ్యామిలీతో టైం స్పెండ్ చేయడానికి ఇష్టపడుతుంది. లేదంటే ఎక్కడో ఓచోటకి వెకేషన్ కి వెళ్తుంది. తాజాగా ఈ బ్యూటీ ఇన్ స్టాగ్రామ్ లో రెడ్ కలర్ లాంగ్ టీషర్టుతో మిడ్డీ లాంటి డ్రెస్ లో ఫోటోలకి పోజులిస్తున్న పిక్స్ షేర్ చేసింది. ఈ ఫోటోలతో ఆమె జపాన్ లో షికారు చేస్తోందని తెలుస్తోంది. ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్లిమ్ అయిన తర్వాత అనుపమ పరమేశ్వరన్ అదిరిపోయే లుక్స్ తో మెస్మరైజ్ చేస్తోందని ఈ ఫోటోలు చూస్తుంటే అర్ధమవుతోంది. ప్రస్తుతం తెలుగులో కొన్ని పాన్ ఇండియా సినిమాల కోసం అనుపమ పేరు పరిశీలిస్తున్నారంట. టిల్లు స్క్వేర్ తర్వాత బడా ప్రొడ్యూసర్స్ నుంచి ఆఫర్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అమ్మడు చేతిలో ఐదు సినిమాలు ఉన్నాయి. తెలుగులో హీరోయిన్ ఒరియాంటెడ్ గా సిద్ధం అవుతోన్న పరదా మూవీ షూటింగ్ దశలో ఉందని తెలుస్తోంది. అలాగే మాతృభాష మలయాళంలో రెండు సినిమాలు చేస్తోంది. తమిళంలో లాక్ డౌన్ అనే మూవీ కంప్లీట్ చేసింది. బిసన్ అనే మరో మూవీ షూటింగ్ స్టేజ్ లో ఉ ంది. ఇవి కాకుండా కొత్త ప్రాజెక్ట్స్ కి సంబంధించిన కథలు వింటున్నట్లు తెలుస్తోంది. ఓ స్టార్ హీరో మూవీలో హీరోయిన్ గా నటించే ఛాన్స్ వస్తే ఆమె రేంజ్ కూడా పెరిగే అవకాశం ఉందని ఇండస్ట్రీలో వినిపిస్తోంది.



## అందాల త్రిష అక్కడా కంబ్యాక్ అవుతోందా?

'పొన్నియన్ సెల్వన్' తర్వాత త్రిష సెకెండ్ ఇన్నింగ్స్ దేదీప్యమానంగా సాగిపోతుంది. అమ్మడికి కొత్త అవకాశాలు అనూహ్యంగా ఊపందుకున్నాయి. మెగాస్టార్ చిరంజీవి, విశ్వనటుడు కమల హాసన్ లాంటి సీనియర్ హీరోలతో పనిచేస్తోంది. 18 ఏళ్ల తర్వాత చిరంజీవితో కలిసి నటించే అవకాశం 'విశ్వంభర' ద్వారా సాధ్యమైంది. అంతకు ముందు ఇదే జోడీ స్టాలిన్ లో అలరించిన సంగతి తెలిసిందే. ఇక కమల్ హాసన్ తో మాత్రం ఇంతవరకూ నటించే అవకాశమే రాలేదు. తొలిసారి 'థగ్ లైఫ్' లో మణిశర్మ ఛాన్స్ ఇవ్వడంతో సాధ్యమైంది. ఇలా తెలుగు, తమిళ్ లో త్రిషకి తిరుగులేదని మరోసారి ప్రూవ్ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా 14 ఏళ్ల తర్వాత మళ్లీ బాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తోంది. సల్మాన్ ఖాన్ హీరోగా విష్ణు వర్దన్ దర్శకత్వంలో 'ది బుల్' అనే సినిమా తెరకెక్కుతుంది. ఇందులో హీరోయిన్ గా త్రిషని ఎంపిక చేసినట్లు సమాచారం. దీంతో 14 ఏళ్ల తర్వాత అమ్మడు బాలీవుడ్ లో అడుగు పెడుతుంది. 'కట్టామిట్టా' అనే చిత్రంతో అమ్మడు బాలీవుడ్ లో అడుగు పెట్టింది. అందులో అక్షయ్ కుమార్ హీరోగా నటించాడు. ఆయనకు జోడీగా త్రిష నటించింది. ఈ సినిమా పెద్దగా ఆడలేదు. దీంతో త్రిషకి హిందీలో అవకాశాలు రాలేదు. కొన్నాళ్ల పాటు ప్రయత్నాలు చేసింది గానీ బాలీవుడ్ దర్శకులు త్రిష వైపు చూడలేదు. దీంతో లాభం లేదనుకున్న త్రిష సౌత్ పైనే దృష్టి పెట్టి పనిచేసింది. అయితే విష్ణు వర్ధన్ కూడా తమిళ దర్శకుడు అన్నది తెలిసిందే. త్రిషకి ఆ రకంగానే ఛాన్స్ వచ్చిందని కొంత మంది అంటున్నారు. అదే హిందీ డైరెక్టర్ అయితే అతడి ఛాయిస్ మరోలా ఉండేదని వినిపిస్తుంది. ఏది ఏమైనా త్రిషకిది మంచి అవకాశం. సెకెండ్ ఛాన్స్ ఆలస్యమైనా దాన్ని నిలబెట్టుకోవాల్సింది త్రిషనే.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986